ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888



పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి

9948814188 9985876888



Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Districts

సంపుటి - 03 సంచిక -76 పేజీలు - 8 వెల - 03/- ఆదివారం 5 జులై 2026


# 'స్వర్ణ కుప్పం' లక్ష్యం

## కుప్పాన్ని 'స్వర్ణ కుప్పం'గా తీర్చిదిద్దడమే లక్ష్యమన్న సీఎం చంద్రబాబు

**కుప్పంలోనూ బంగారం నిక్షేపాలు ఉన్నాయంటున్నారు... వెలికితీస్తాం: సీఎం చంద్రబాబు**

**రూ.118 కోట్లతో ఆధునిక బస్ స్టేషన్, డిపో నిర్మాణానికి శంకుస్థాపన**

**కర్నూలు జిల్లా జొన్నగిరి తరహాలోనే కుప్పంలోనూ బంగారు గనులు ఉన్నాయని వెల్లడి**

**గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు, సీమలో ఫ్యాక్షన్ యుగం ముగిసిందని స్పష్టీకరణ**

**అమరావతి రాజధానిగా ఉండాలని ప్రజలు కోరుకుంటే, గొడ్డలి పార్టీ 'మావిగన్' అంటోందని ఎద్దేవా**





**కుప్పం జూలై 4 రిపబ్లిక్ న్యూస్.**
తన సొంత నియోజకవర్గమైన కుప్పాన్ని ఒక అభివృద్ధి కేంద్రంగా, దేశానికే ఆదర్శంగా నిలిపే 'స్వర్ణ కుప్పం' నిర్మాణానికి నాంది పలుకుతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. కుప్పం పర్యటనలో భాగంగా... రూ.118 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అత్యాధునిక ఆర్టీసీ బస్ స్టేషన్, డిపో పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. **మిగతా 2లో...**

# ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

**యుద్ధం వేళ ఇంధనంపై ప్రజలను భయపెట్టే యత్నాలు జరిగాయి**

**అయితే సమర్ధంగా సవాళ్లను అధిగమంచగలిగాం**

**రాజస్థాన్‌లో గ్రీన్ రిఫైనరీని ప్రారంభించిన ప్రధాని మోడీ**



**జయపుర,జూలై 4 రిపబ్లిక్ న్యూస్.**
పశ్చిమాసియా సంక్షోభం వేళ దేశంలో ఇంధన సంక్షోభాన్ని విజయవంతం ఎదుర్కొన్నట్లు ప్రధాని మోడీ అన్నారు. ప్రజలను భయపెట్టే ప్రయత్నాలు జరిగాయి. రాజకీయాలు చేశారు. కానీ వారి కుట్రలు ఫలించలేదు. కొన్ని చిన్న చిన్న ఇబ్బందులు తప్ప దేశంలో ఎక్కడా ఇంధన సరఫరా ఆగలేదఅని అన్నారు. శనివారం రాజస్థాన్‌లోని బాలోత్రా జిల్లా పచ్‌పద్రాలో దేశంలోని తొలి గ్రీన్‌ఫీల్డ్ సమగ్ర రిఫైనరీ–పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను మోడీ ప్రారంభించారు. సుమారు రూ.1.06 లక్షల కోట్ల విలువైన పెట్రోకెమికల్స్, రైల్వేలు, రహదారులు, మెట్రో, పునరుత్పాదక ఇంధనం,**మిగతా 2లో...**



# 23 మందిని ఉగ్రవాదులుగా ప్రకటించిన కేంద్రం!

**వీరిలో 17 మంది పాక్ పౌరులు, ఆరుగురు భారతీయులు**

**జాబితాలో జైష్, లష్కరే తోయిబా కీలక నేతలు**

**ఉగ్రదాడులు, చొరబాట్లు, నిధుల సమీకరణ, నియామకాల ఆరోపణలు**

**సుంజ్వాన్, నాగ్రోటా దాడులతో సంబంధాలున్నట్లు వెల్లడి**

**న్యూఢిల్లీ,జూలై 4 రిపబ్లిక్ న్యూస్.**
పాకిస్థాన్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న 23 మందిని చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) కింద ఉగ్రవాదులుగా కేంద్రం ప్రకటించింది. వీరిలో జైష్–ఎ–మహ్మద్ (జేఈఎం), లష్కరే తోయిబా (ఎల్ఈటీ)తో పాటు వాటి అనుబంధ సంస్థలకు చెందిన కీలక నేతలు ఉన్నారు.**మిగతా 2లో...**

# జోసెఫ్, ప్రకాశ్ రాజ్‌ల మధ్య అక్రమ సంబంధం

**సంఘ విద్రోహ శక్తులనడంలో సందేహం లేదు**

**తాడేపల్లి ప్యాలెస్ కనుసన్నల్లో ప్రకాశ్ రాజ్ ఆస్కింగ్**

**అక్కడి డబ్బుల కోసం ఇద్దరూ రాష్ట్రంలో ఘర్షణలకు యత్నం**

**డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ లక్ష్యంగా ప్రకాశ్ రాజ్ చర్యలు**

**ఘాటు విమర్శలు చేసిన మంత్రి కందుల దుర్గేశ్**

**అమరావతి,జూలై 4 రిపబ్లిక్ న్యూస్.**
సినీనటుడు ప్రకాశ్‌రాజ్, కాకినాడకు చెందిన యూట్యూబర్ బచ్చులకూరి జోసెఫ్ (రావణ్) వ్యాఖ్యలపై మంత్రి కందుల దుర్గేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జస్ట్ ఆస్కింగ్ అంటున్న ప్రకాశ్ రాజ్, జోసెఫ్ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జోసెఫ్ సూచనలతో ప్రకాశ్‌రాజ్ స్పందిస్తారని విమర్శించారు. ఇద్దరి మధ్య అనుబంధం ఉందనేందుకు మా దగ్గర ఆధారాలున్నాయి. జోసెఫ్ ప్రశ్నించగానే.. జస్ట్ ఆస్కింగ్ అంటూ ప్రకాశ్‌రాజ్ వస్తారు. పవన్ కల్యాణ్ లక్ష్యంగా ఇద్దరూ కలిసి కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు.**మిగతా 2లో...**



# వారసత్వ భూములకు ఆటో మ్యుటేషన్ అమలు

**వారసత్వ భూములపై ఏపీ సర్కార్ కీలక నిర్ణయం..**

**ఇక ఆఫీసుల చుట్టూ తిరగనక్కర్లేదు!**

**రిజిస్ట్రేషన్ పూర్తి కాగానే రెవెన్యూ రికార్డుల్లో వారసుల పేర్లు**

**మ్యుటేషన్ కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే అవస్థలకు చెక్**

**రూ.10 లక్షల లోపు విలువైన భూమికి స్టాంప్ డ్యూటీ కేవలం రూ.100**

**వీలునామా లేకపోతే రిజిస్ట్రేషన్ సమయంలో ఎఫ్ఎంసీ తప్పనిసరి**

**అమరావతి,జూలై 4 రిపబ్లిక్ న్యూస్.**
ఆంధ్రప్రదేశ్‌లో వారసత్వంగా సంక్రమించిన వ్యవసాయ భూముల బదలాయింపు ప్రక్రియను ప్రభుత్వం మరింత సులభతరం చేసింది. ఇప్పటికే నామమాత్రపు స్టాంప్ డ్యూటీతో రిజిస్ట్రేషన్లకు అనుమతించిన సర్కార్, తాజాగా మరో కీలక ముందడుగు వేసింది. వారసత్వ ఆస్తుల పంపకాల దస్తావేజు**మిగతా 2లో...**



# సాయికృష్ణ కేసులో మెజిస్టీరియల్ విచారణ

**విచారణకు హాజరైన తల్లీ, కుటుంబీకులు**

**సిఐ నాగరాజు తన కొడుకును మాయం చేశాడన్న తల్లి**



**విజయవాడ,జూలై 4 రిపబ్లిక్ న్యూస్.** గాదె సాయికృష్ణ కేసుకు సంబంధించి మెజిస్ట్రీరియల్ విచారణ కొనసాగుతోంది. విజయవాడలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన విచారణకు సాయికృష్ణ తల్లి **మిగతా 2లో...**

# పార్లమెంట్ వర్షాకాల షెడ్యూల్ ఖరారు

**జూలై20 నుంచి ఆగస్ట్ 13 వరకు సమావేశాలు**

**ఎక్స్ వేదికగా వెల్లడించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు**




**న్యూఢిల్లీ,జూలై 4 రిపబ్లిక్ న్యూస్.**
పార్లమెంట్ వర్షాకాల సమావేశాల షెడ్యూల్ ఖరారయ్యింది. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సోషల్ మీడియా ఎక్స్‌లో పేర్కొన్నారు. జూలై 20 నుంచి ఆగస్టు 13 వరకు సమావేశాలు జరగనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సిఫారసు మేరకు పార్లమెంట్ 2026 వర్షాకాల సమావేశాలను నిర్వహించేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. దేశ ప్రాధాన్యత కలిగిన కీలక అంశాలపై అర్థవంతమైన చర్చలు, సమగ్ర చర్చోపచర్చలు, నిర్ణయాలు తీసుకునేందుకు **మిగతా 2లో...**

# మంత్రి నారా లోకేశ్ కు దక్షిణ కొరియా అధికారిక ఆహ్వానం...

**జూలై 5 నుంచి 11 వరకు కొరియాలో పర్యటన**

**ద్వైపాక్షిక సంబంధాలు, పెట్టుబడుల ఆకర్షణే ప్రధాన ఎజెండా**

**ఎల్జీ, హ్యోసంగ్ వంటి దిగ్గజ సంస్థలతో కీలక సమావేశాలు**

**సీఐఐ భాగస్వామ్య సదస్సు కోసం కొరియాలో ప్రత్యేక రోడ్ షో**

**అమరావతి,జూలై 4 రిపబ్లిక్ న్యూస్.**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యా, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటించనున్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే ఉద్దేశంతో తమ దేశంలో పర్యటించాలని రిపబ్లిక్ ఆఫ్ కొరియా (దక్షిణ కొరియా) ప్రభుత్వం ఆయన్ను అధికారికంగా ఆహ్వానించింది. **మిగతా 2లో...**



# కవితకు ఎన్నికల సంఘం షాక్

## టీఆర్ఎస్ పార్టీ పేరు మార్చుకోవాలని నోటీస్

**అలాంటి ప్రసక్తి లేదంటూ స్పష్టం చేసిన కవిత**

**అవసరమైతే సుప్రీంపు ఆశ్రయిస్తామని వెల్లడి**

**హైదరాబాద్,,జూలై 4 రిపబ్లిక్ న్యూస్.**
కల్వకుంట్ల కవిత స్థాపించిన 'తెలంగాణ రక్షణ సేన' టీఆర్ఎస్ పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం షాక్ ఇచ్చింది. కవిత కొత్త పార్టీ పేరును మార్చాలంటూ ఈసీ ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ రక్షణ సేన పేరుపై ప్రజల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయని ఎలక్షన్ కమిషన్ పేర్కొంది. **2లో...**



రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888



# 23 మందిని ఉగ్రవాదులుగా ప్రకటించిన కేంద్రం!

**మొదటిపేజీ తరువాయి**

కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఉగ్రదాడులు, ఉగ్రవాదుల నియామకం, నిధుల సమీకరణ, ఆయుధాల అక్రమ రవాణా, సరిహద్దు చొరబాట్లు, ఉగ్ర సంస్థలకు సహకారం వంటి కార్యకలాపాల్లో వీరు పాల్గొంటున్నట్లు పేర్కొంది.ఈ 23 మందిలో 17 మంది పాకిస్థాన్ పౌరులు, ఆరుగురు భారతీయులు ఉన్నారు. ప్రస్తుతం వీరంతా పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) నుంచి ఉగ్ర కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని కేంద్రం తెలిపింది.ఈ జాబితాలో జైష్‌కు చెందిన మసూద్ ఇల్యాస్ కశ్మీరీ, మొహమ్మద్ ముసద్దిక్, ముఫ్తీ మహ్మద్ అస్గర్ ఖాన్, అబ్దుల్లా జెహాదీ వంటి కీలక నేతలు ఉన్నారు. వీరు ఉగ్రవాదుల శిక్షణ, నియామకం, భారత్‌లోకి చొరబాట్లు, దాడుల ప్రణాళికలో కీలక పాత్ర పోషించినట్లు కేంద్రం ఆరోపించింది. 2022 సుంజ్వాన్ దాడి, 2016 నాగ్రోటా ఆర్మీ క్యాంప్‌పై దాడులతోనూ వీరికి సంబంధాలు ఉన్నట్లు పేర్కొంది.లష్కరే తోయిబాకు చెందిన ఫిర్దౌస్ అహ్మద్ భట్, హరూన్ రషీద్ గనాయ్ తో పాటు మరికొందరినీ ఉగ్రవాదుల జాబితాలో చేర్చారు. వీరు ఆయుధాల సరఫరా, యువతను ఉగ్రవాదంలోకి ఆకర్షించడం, దాడులకు అవసరమైన లాజిస్టిక్ సహాయం అందించినట్లు ప్రభుత్వం తెలిపింది.2019లో యూఏపీఏ సవరణల తర్వాత ఉగ్ర సంస్థలతో పాటు వ్యక్తులను కూడా నేరుగా ఉగ్రవాదులుగా ప్రకటించే అధికారం కేంద్రానికి లభించింది. అదే అధికారాన్ని వినియోగిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

# సాయికృష్ణ కేసులో మెజిస్టీరియల్ విచారణ

**మొదటిపేజీ తరువాయి**

విజయలక్ష్మి, మేనమామ నాగేశ్వరరావు, మేనత్త శనివారం హాజరై తమ వాంగ్మూలాలను నమోదు చేశారు. ఈ కేసు విచారణ సందర్భంగా పోలీసులపై విజయలక్ష్మి సంచలన ఆరోపణలు చేశారు. తన కుమారుడు సాయికృష్ణను పోలీసులే చంపేసి, అనంతరం మృతదేహాన్ని మాయం చేశారని ఆరోపించారు. కృష్ణలంక పోలీసుస్టేషన్‌లో తన కుమారుడు ఉన్నట్లు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లామని తెలిపారు. అయితే, అప్పటి సీఐ నాగరాజు తన కుమారుడిని చూపకుండా వెనక్కి పంపించారని ఆమె వెల్లడించారు. ఈ కేసులో తమ కుటుంబానికి న్యాయం చేయాలని విచారణాధికారిని విజయలక్ష్మి వేడుకున్నారు. దాదాపు రెండు గంటలకు పైగా మెజిస్టీరియల్ విచారణ కొనసాగింది. ఈ కేసులో పూర్తి నిజాలు వెలుగులోకి రావాలంటే సమగ్ర, నిష్పాక్షిక విచారణ అవసరమని డిమాండ్ చేశారు. ఈ కేసు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారగా, మేజిస్ట్రేట్ విచారణలో వెలుగులోకి వచ్చే అంశాలు కీలకంగా మారనున్నాయి.

----------------

# పార్లమెంట్ వర్షాకాల షెడ్యూల్ ఖరారు

**మొదటిపేజీ తరువాయి**

ఈ సమావేశాలు వేదిక కానున్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఇక ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశముండగా దేశ ఆర్థిక వ్యవస్థ, జాతీయ భద్రత, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమం, ఇతర సమకాలీన అంశాలపై కూడా ఇరు సభల్లో విస్తృతంగా చర్చలు జరిగే అవకాశం ఉంది. అలాగే ప్రతిపక్ష పార్టీలు కూడా వివిధ ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించే అవకాశముంది. ఇటీవలి పరిణామాలు, దేశీయ, అంతర్జాతీయ అంశాలతో పాటు పలు రాష్ట్రాలకు సంబంధించిన సమస్యలను కూడా ప్రతిపక్ష పార్టీలు ఈ సమావేశాల్లో ప్రస్తావించే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వం కూడా తన కీలక విధానాలు, సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశాలను సభ ముందుకు తీసుకురానుంది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందు ముగియనున్న ఈ సమావేశాల్లో పలు కీలక నిర్ణయాలు, చర్చలు జరిగే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వర్షాకాల సమావేశాల్లో ఎన్డీఏ ప్రభుత్వం పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ముఖ్యంగా రెండు రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకురానున్నట్లు తెలుస్తోంది. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజనను సవరణలతో మళ్లీ ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ బిల్లులో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల సభ్యుల సంఖ్యను 50 శాతం పెంచే ప్రతిపాదన కూడా ఉండొచ్చని సమాచారం. ఇక ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వాన్ని పలు అంశాలపై నిలదీయడానికి సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా నీట్ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారం, అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం, నిరుద్యోగ సమస్య వంటి అంశాలపై కేంద్రాన్ని ఇరుకున పెట్టేందుకు వ్యూహరచన చేస్తున్నట్లు సమాచారం. దీంతో ఈసారి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు హాట్ హాట్‌గా జరిగే సూచనలు కనిపిస్తున్నాయి.

# లోకేశ్ కు దక్షిణ కొరియా అధికారిక ఆహ్వానం...

**మొదటిపేజీ తరువాయి**

ఈ మేరకు ఆయన జూలై 5 నుంచి 11వ తేదీ వరకు కొరియాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా మంత్రి లోకేశ్.. కొరియాలోని పలు మంత్రిత్వ శాఖల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో కీలక సమావేశాల్లో పాల్గొంటారు.ఈ పర్యటన ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుందని చెన్నైలోని దక్షిణ కొరియా కాన్సులేట్ జనరల్ చాంగ్ న్యూన్ కిమ్, మంత్రి లోకేశ్ కు పంపిన ఆహ్వాన లేఖలో పేర్కొన్నారు. భారత్–కొరియా మధ్య సంబంధాలను మరింత పటిష్ఠం చేయడంలో ఈ పర్యటన ఒక కీలక ముందడుగు అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.జులై 5న సియోల్‌లో ఇండియా డయాస్పోరా ఏర్పాటు చేసే ఆత్మీయ సమావేశానికి హాజరై అక్కడి భారతీయులు, ముఖ్యంగా తెలుగువారిని ఉద్దేశించి ప్రసంగిస్తారు. జులై 6వ తేదీన దక్షిణ కొరియాకు చెందిన టెక్ స్టార్టప్ సంస్థల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని, పెట్టుబడులపై చర్చలు జరుపుతారు. అనంతరం, హ్యోసంగ్ భారీ పరిశ్రమల సంఘం అధ్యక్షుడు టకేషి యొకోటా, సియోల్ సెమీకండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ టేహ్యూంగ్ లీతో లోకేశ్ ప్రత్యేకంగా సమావేశమవుతారు.జులై 7న ప్రపంచ ప్రఖ్యాత ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఎల్జీ టవర్స్‌లో కీలక సమావేశం జరగనుంది. ఎల్జీ కెమ్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్ యున్ జు కోహ్ ఏర్పాటు చేసిన విందు సమావేశంలో లోకేశ్ పాల్గొంటారు. ఈ భేటీకి ఎల్జీ అనుబంధ సంస్థల ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందాలు కూడా హాజరుకానున్నాయి. జులై 8వ తేదీన కొరియన్ మెరైన్ అక్విప్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులతో భేటీ ఉంటుంది.జులై 9న కొరియన్ పొలిటికల్ అఫైర్స్, ఇంటర్నేషనల్ ట్రేడ్ & ఇన్వెస్ట్‌మెంట్స్ విభాగాల డిప్యూటీ మంత్రులతో వేర్వేరుగా భేటీ అవుతారు.

జులై 10వ తేదీన వివిధ సంస్థల ప్రతినిధులతో పెట్టుబడుల గురించి చర్చించడంతో పాటు, కొరియా ఆటో ఇండస్ట్రీ కోఆపరేషన్ ఏజెన్సీ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరవుతారు.

# కవితకు ఎన్నికల సంఘం షాక్

**మొదటిపేజీ తరువాయి**

15 రోజుల్లో మూడు ప్రత్యామ్నాయ పేర్లు సమర్పించాలని ఆదేశించింది. లేని పక్షంలో దరఖాస్తును మూసివేస్తామని హెచ్చరించింది. టీఆర్ఎస్ పేరును కొనసాగించేందుకు వీల్లేదంటూ కవితకు ఈసీ లేఖ రాసింది. పేరు వివాదంతో కవిత కొత్త పార్టీ రిజిస్ట్రేషన్‌కు తీవ్ర అడ్డంకులు ఏర్పడ్డాయి. దీంతో కొత్త పేర్లతో దరఖాస్తును సవరించాలని ఈసీ సూచించింది. ఈసీ లేఖపై కవిత స్పందించారు. తమకు అధికారికంగా ఈసీ నుంచి వచ్చిన రెండు అభ్యంతరాలకు సమాధానం ఇచ్చామని తెలిపారు. అయితే కొత్త పేర్లు ఇచ్చేది లేదని.. న్యాయపోరాటానికే సిద్ధమని కవిత స్పష్టం చేశారు. తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సంచలనంగా మారిన కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీ 'తెలంగాణ రక్షణ సేన' సంక్షిప్త నామంపై కేంద్ర ఎన్నికల సంఘం (ఇఅఎ) పంపిన లేఖ రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. పార్టీ పేరు మార్చుకోవాలంటూ ఈసీ పంపిన నోటీసులపై పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత అత్యంత ఘాటుగా స్పందించారు. కేంద్ర ఎన్నికల సంఘం లేఖ తమకు అందిందని, వారు లేవనెత్తిన రెండు ప్రధాన అభ్యంతరాలకు తాము ఇప్పటికే పూర్తిస్థాయిలో చట్టపరమైన సమాధానాలు ఇచ్చామని ఆమె స్పష్టం చేశారు. తమ పార్టీ సంక్షిప్త నామం ఎప్పటికీ 'టిఆర్ఎస్ మాత్రమేనని ఆమె తేల్చి చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం సూచించినట్లుగా తాము కొత్త పేర్లు గానీ, ప్రత్యామ్నాయ సంక్షిప్త నామాలు గానీ ఇచ్చే ప్రసక్తే లేదని కవిత మీడియా ముఖంగా కుండబద్దలు కొట్టారు. ప్రజా క్షేత్రంలో ఇప్పటికే 'టిఆర్ఎస్ పేరుతో తాము దూసుకుపోతున్నామని, ఈ తరుణంలో వెనక్కితగ్గే ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఒకవేళ ఈసీ తమ వివరణను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తే, దీనిపై అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయపోరాటం చేయడానికి కూడా తాము సిద్ధంగా ఉన్నామని ఆమె స్పష్టం చేశారు. పిలుపునిచ్చారు. భారత్ రాష్ట్ర సమితి నుంచి బయటకు వచ్చిన తర్వాత కవిత అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ కొత్త పార్టీని స్థాపించి, తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్లీ రాజేసేలా 'టిఆర్ఎస్ ' అనే సంక్షిప్త నామాన్ని ఎంచుకున్నారు. గతంలో తన తండ్రి కేసీఆర్ నేతృత్వంలో కొనసాగిన పాత పేరును గుర్తుచేసేలా ఉండటంతో ఈ పేరు ప్రజల్లోకి వేగంగా దూసుకెళ్లింది. అయితే, టెక్నికల్ మరియు లీగల్ అభ్యంతరాల నేపథ్యంలో ఈసీ నుంచి 15 రోజుల గడువుతో నోటీసులు రావడం, దానికి కవిత ధీటుగా బదులివ్వడం తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ పరిణామం కవిత రాజకీయ ప్రస్థానానికి ఒక సవాల్‌గా మారినప్పటికీ, ఆమె దీనిని చట్టపరంగా ఎదుర్కొనేందుకు వ్యూహాలు రచిస్తున్నారు.

# వారసత్వ భూములకు ఆటో మ్యుటేషన్ అమలు

**మొదటిపేజీ తరువాయి**

రిజిస్ట్రేషన్ పూర్తి కాగానే, ఆటోమేటిక్‌గా మ్యుటేషన్ (రెవెన్యూ రికార్డుల్లో పేరు మార్పిడి) జరిగేలా కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ నిర్ణయంతో భూ యజమానులు మ్యుటేషన్ కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే అవస్థలు తప్పనున్నాయి.

**పాత పద్ధతికి స్వస్తి.. కొత్త విధానం ఇలా**

ఇంతకుముందు, కుటుంబ పెద్ద మరణానంతరం వారసులు తమ పేర్ల మీదకు భూమిని మార్చుకోవాలంటే ఎన్నో ఇబ్బందులు పడేవారు. ముందుగా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ (ఎఫ్ఎంసీ) కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత రెవెన్యూ అధికారులను ఆశ్రయించి మ్యుటేషన్ చేయించుకోవాల్సి వచ్చేది. ఈ ప్రక్రియ ఆలస్యం కావడంతో పాటు, రైతులకు శ్రమ, ఖర్చుతో కూడుకున్నదిగా ఉండేది.

తాజా విధానం ప్రకారం, కుటుంబ సభ్యులు తమ మధ్య ఆస్తులను పంచుకుంటూ రాసుకున్న పంపకాల దస్తావేజును సబ్–రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించిన వెంటనే, ఆ సమాచారం ఆన్‌లైన్‌లో రెవెన్యూ శాఖకు చేరుతుంది. దీని ఆధారంగా రెవెన్యూ రికార్డుల్లో వారసుల పేర్లను నమోదు చేసే 'ఆటో–మ్యుటేషన్' ప్రక్రియ పూర్తవుతుంది. దీంతో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ఏకకాలంలో జరిగిపోతాయి.

**వీలునామా లేకపోతే ఎఫ్ఎంసీ తప్పనిసరి**

అయితే, ఈ ప్రక్రియలో ప్రభుత్వం ఒక ముఖ్యమైన నిబంధనను చేర్చింది. కుటుంబ పెద్ద (తాత, తండ్రి లేదా తల్లి) ఎలాంటి వీలునామా రాయకుండా మరణిస్తే, వారసులు ఆస్తి పంపకాల దస్తావేజును రిజిస్ట్రేషన్ చేసే సమయంలో తప్పనిసరిగా ఎఫ్ఎంసీ సమర్పించాల్సి ఉంటుంది. వీలునామా ఉంటే ఈ నిబంధన వర్తించదు.

**రైతులకు భారీ ఊరట**

గతంలో ఏపీ ప్రభుత్వం వారసత్వ భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. రూ. 10 లక్షల లోపు విలువైన వ్యవసాయ భూమికి కేవలం రూ. 100 స్టాంప్ డ్యూటీగా, రూ. 10 లక్షలు దాటితే రూ. 1,000గా నిర్ణయించింది. ఇప్పుడు రిజిస్ట్రేషన్‌ను మ్యుటేషన్‌తో అనుసంధానించడం వల్ల రైతులకు పూర్తిస్థాయిలో హక్కులు వేగంగా లభిస్తాయి. పట్టాదారు పాస్‌పుస్తకాలు సకాలంలో చేతికి అందడంతో పాటు ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు పొందడం కూడా సులభతరం అవుతుంది. ఈ సమీకృత విధానం పరిపాలనలో పారదర్శకతను పెంచడంతో పాటు, రైతులకు భరోసా కల్పిస్తుందని అధికారులు చెబుతున్నారు.

# ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

**మొదటిపేజీ తరువాయి**

విద్యుత్ ప్రసార ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. దేశ ఇంధన భద్రత, పశ్చిమాసియా యుద్ధం సమయంలో భారత్ ఎదుర్కొన్న సవాళ్లు, వాటిని అధిగమించిన విధానంపై కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రపంచ ఇంధన మార్కెట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని ప్రధాని తెలిపారు. ఈ సమయంలో భారత్‌లో ఇంధన కొరత వస్తుందని కొందరు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ప్రతిపక్షాలను ఉద్దేశించి ఆరోపించారు. ఏప్రిల్ నుంచి జూన్ మధ్యకాలంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వ చమురు మార్కెటింగ్ సంస్థలు రూ.75 వేల కోట్లకు పైగా నష్టాన్ని భరించాయని తెలిపారు. ప్రజలపై భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం లీటరుకు రూ.10 ఎక్సైజ్ సుంకాన్ని కూడా తగ్గించిందని పేర్కొన్నారు. భారత్‌కు పెద్దగా చమురు నిల్వలు లేవని గుర్తుచేసిన ప్రధాని.. యుద్ధం సమయంలో ముడి చమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల నుంచి 120 డాలర్లకు పెరిగిందన్నారు. కొన్ని దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు 40–50 శాతం పెరగడమే కాకుండా రేషన్ విధానం కూడా అమలు చేశారని చెప్పారు. అయితే భారత్‌లో మాత్రం ఒక్కరోజు కూడా ఇంధన కొరత తలెత్తలేదని స్పష్టం చేశారు. సంక్షోభానికి ముందు భారత్ కేవలం 25–26 దేశాల నుంచే ఇంధనం దిగుమతి చేసుకునేదని.. కానీ యుద్ధం ప్రారంభమైన తర్వాత భారత దౌత్యపరమైన ప్రయత్నాల వల్ల 40కిపైగా దేశాల నుంచి చమురు, ఇంధనం దిగుమతి చేసుకున్నామని ప్రధాని వెల్లడించారు. దేశ ప్రయోజనాలు, ప్రజల సంక్షేమమే భారత్‌కు అత్యంత ప్రాధాన్యం అనే సందేశాన్ని ప్రపంచానికి ఇచ్చామని అన్నారు. భారత్‌కు అవసరమైన ఎల్పీజీలో దాదాపు 60 శాతం దిగుమతుల ద్వారానే వచ్చేదని.. అందులో 90 శాతం హార్ముజ్ జలసంధి మార్గంలో గల్ఫ్ దేశాల నుంచే వచ్చేదని తెలిపారు. యుద్ధం కారణంగా సరఫరా దాదాపు నిలిచిపోయిన సమయంలో రిఫైనరీల సామర్థ్యాన్ని వినియోగించి కేవలం ఏడు రోజుల్లోనే దేశీయ ఎల్పీజీ ఉత్పత్తిని 35 వేల మెట్రిక్ టన్నుల నుంచి 54 వేల మెట్రిక్ టన్నులకు పెంచామని చెప్పారు. ఇప్పటివరకు ఎల్పీజీ ఉత్పత్తి చేయని కొన్ని రిఫైనరీలను కూడా ఈ అవసరానికి అనుగుణంగా మార్చినట్లు తెలిపారు.దేశవ్యాప్తంగా పైప్ ద్వారా సహజ వాయువు కనెక్షన్లను వేగంగా విస్తరించామని, 11 లక్షలకుపైగా కుటుంబాలకు కొత్త పీఎన్జీ కనెక్షన్లు అందించామని ప్రధాని వెల్లడించారు.మార్కెట్ అంచనాల ప్రకారం గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ ధర రూ.2,000 వరకు చేరే అవకాశం ఉన్నప్పటికీ.. ప్రస్తుతం రూ.950లోపే అందిస్తున్నామని పేర్కొన్నారు. పశ్చిమాసియా యుద్ధం 21వ శతాబ్దంలోనే అతిపెద్ద ఇంధన సంక్షోభానికి కారణమైందన్నారు. సమస్యను ముందుగానే అంచనా వేసి సరైన నిర్ణయాలు తీసుకున్నాం. దేశ వనరులను సమర్థంగా వినియోగించాం. దౌత్య శక్తిని సానుకూలంగా ఉపయోగించాం. అందుకే భారత్ ఈ సంక్షోభాన్ని విజయవంతంగా అధిగమించిందని చెప్పారు. ఇర పచ్‌పద్రా రిఫైనరీతో భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద రిఫైనింగ్ దేశంగా మరింత బలోపేతమవుతోందని ప్రధాని తెలిపారు. ఈ సమగ్ర రిఫైనరీకి ఏడాదికి 2.4 మిలియన్ మెట్రిక్ టన్నుల పెట్రోకెమికల్ ఉత్పత్తి సామర్థ్యం ఉందన్నారు. ఇది దేశ ఇంధన భద్రతను పెంచడంతో పాటు పెట్రోకెమికల్ రంగంలో స్వయం సమృద్ధికి దోహదపడుతుందని.. వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అదనంగా జైపూర్ మెట్రో రెండో దశ, రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, బికానేర్ సోలార్ పార్కులు, విద్యుత్ ప్రసార లైన్లు సహా పలు అభివృద్ధి ప్రాజెక్టులను కూడా ప్రధాని దేశానికి అంకితం చేశారు.

--------------------------

# జోసెఫ్, ప్రకాశ్ రాజ్‌ల మధ్య అక్రమ సంబంధం

**మొదటిపేజీ తరువాయి**

తెరముందు వీళ్లుంటే.. తెర వెనుక ఎవరున్నారో తేలాలి. తాడేపల్లి ప్యాలెస్ డైరెక్షన్‌లోనే ఈ కుట్ర సాగుతోందని అనుమానం వ్యక్తం చేశారు. కుల, మత విద్వేషాలు రెచ్చగొట్టేలా కుట్రలు చేస్తున్నారు. ఇలాంటి సంఘవిద్రోహ శక్తులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. వైకాపా పాలనలో జస్ట్ ఆస్కింగ్ అని ఎందుకు అడగలేకపోయారో చెప్పాలన్నారు. పవన్ కల్యాణ్‌ను ఒక కుల చట్రంలో బంధించేందుకు కుట్రలు చేస్తున్నారు. ప్రశ్నించడం అంటే.. బూతులు తిట్టడం.. వ్యక్తిగత విమర్శలు చేయడమా? ప్యాలెస్ నుంచి వచ్చే డబ్బు కోసమే ప్రకాశ్‌రాజ్ మాట్లాడుతున్నారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచి జరిగే ఈ కుతంత్రాలను ప్రజలు తిప్పి కొట్టాలని కందుల పిలుపునిచ్చారు. నటుడు ప్రకాశ్‌రాజ్ చేసిన ట్వీట్‌పై మంత్రి కందుల దుర్గేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఘర్షణ వాతావరణాన్ని సృష్టించేలా కొందరు వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రకాశ్‌రాజ్‌తో పాటు జోసెఫ్ రావణ్‌పై కూడా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రకాష్‌రాజ్, జోసెఫ్ రావణ్ సంఘవిద్రోహ శక్తులుగా మారారని విమర్శించారు. ప్రకాష్‌రాజ్‌కు జోసెఫ్ రావణ్‌తో ఏమైనా సంబంధం ఉందా అనే అనుమానాలు వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఘటనలపై ప్రకాష్‌రాజ్ ఎందుకు స్పందించలేదని మంత్రి ప్రశ్నించారు. వైసీపీ పాలనలో జరిగిన అకృత్యాలు, హిందూ ఆలయాలపై దాడుల సమయంలో ఆయన ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. అంతేకాకుండా, తాడేపల్లి ప్యాలెస్ నుంచి మీకు ప్రతి నెలా ఎంత డబ్బు అందుతోందని ప్రకాష్‌రాజ్‌ను ఉద్దేశించి మంత్రి దుర్గేష్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు భంగం కలిగించి విధ్వంసకర వాతావరణాన్ని సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని మంత్రి దుర్గేష్ వ్యాఖ్యానించారు.సోషల్ మీడియాలో 'జస్ట్ ఆస్కింగ్' అంటూ గొంతు చించుకునే ప్రకాష్ రాజ్‌కు, బూతులు తిట్టే జోసెఫ్ రావణ్‌కు మధ్య అపవిత్ర, అక్రమ సంబంధం ఉందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. వీరిద్దరి మధ్య ఉన్న అనుబంధానికి, చీకటి ఒప్పందాలకు సంబంధించిన పక్కా ఆధారాలు తమ వద్ద ఉన్నాయని మంత్రి స్పష్టం చేశారు. జోసెఫ్ రావణ్ ప్రమేయం, సూచనలతోనే ప్రకాష్ రాజ్ సోషల్ మీడియాలో స్పందిస్తుంటాడని.. రావణ్ ప్రశ్నించమంటూ లైన్‌లోకి రాగానే, ప్రకాష్ రాజ్ 'జస్ట్ ఆస్కింగ్' అంటూ తెరపైకి వస్తాడని మండిపడ్డారు. 'నా లింక్ లు ఓపెన్ చేస్తే.. మీకు అసలు మ్యాటర్ అర్థమవుతుంది' అంటూ ప్రకాష్ రాజ్, రావణ్ మాట్లాడుకున్న ఆడియో కాల్ కూడా ఇప్పుడు బయటకు వచ్చిందని ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని వీరిద్దరూ కలిసి పెద్ద ఎత్తున కుట్రలు పన్నుతున్నారని కందుల దుర్గేష్ ఆరోపించారు. ప్యాలెస్ నుంచి వచ్చే డబ్బు కోసమే, ఈ రాష్ట్రంతో ఎలాంటి సంబంధం లేకపోయినా ప్రకాష్ రాజ్ ఇక్కడ మాట్లాడుతున్నాడని విమర్శించారు. వీరు కేవలం డబ్బు కోసమే కుల, మత విద్వేషాలు రెచ్చగొడుతూ రాష్ట్రంలో విధ్వంసం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని, మత ఘర్షణల మంటల్లో చలి కాచుకునే నైజం వీరిదని దుయ్యబట్టారు.

# 'స్వర్ణ కుప్పం' లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

అనంతరం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రసంగించిన చంద్రబాబు, అభివృద్ధి ప్రణాళికలను వివరిస్తూనే గత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు.

**కుప్పంలోనూ బంగారు గనులు**

కర్నూలు జిల్లా జొన్నగిరిలో గోల్డ్ ఫీల్డ్స్ ప్రారంభించామని తెలిపారు. ఇప్పుడు కుప్పం ప్రాంతంలోనూ బంగారు గనులు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారని చంద్రబాబు సంచలన విషయం వెల్లడించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆ బంగారు నిక్షేపాలను వెలికితీసి, 'స్వర్ణ కుప్పం' ఆవిష్కరణకు నిజమైన అర్థం కల్పిస్తామని ప్రకటించారు.

మైక్రో ఇరిగేషన్‌లో దేశానికే ఆదర్శంగా నిలిచిన కుప్పం మోడల్‌ను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామన్నారు. హంద్రీ–నీవా జలాలతో 110 చెరువులు నింపామని గుర్తుచేశారు. రాయలసీమను ఉద్యాన హబ్‌గా మార్చే 'పూర్వోదయ' ప్రాజెక్టుకు వచ్చే నెల మదనపల్లెలో శంకుస్థాపన చేస్తామని తెలిపారు.

**ఉద్యోగాల కేంద్రంగా కుప్పం**

ఒకప్పుడు ఎన్టీఆర్ హయాంలో కుప్పంలో బస్ స్టేషన్‌కు శంకుస్థాపన జరిగిందని, ఇప్పుడు అదే స్థానంలో సౌర విద్యుత్ వంటి ఆధునిక సదుపాయాలతో మోడల్ బస్ స్టేషన్, డిపో నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చంద్రబాబు తెలిపారు. కుప్పాన్ని స్వర్ణ కుప్పంగా మార్చే క్రమంలో పరిశ్రమల స్థాపనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. "ఉద్యోగాల కోసం కుప్పం యువత బయటకు వెళ్లడం కాదు, ఇతర ప్రాంతాల వారు ఉద్యోగాల కోసం కుప్పానికి వచ్చే పరిస్థితి కల్పిస్తాం" అని ఆయన ఉద్ఘాటించారు. ఒక్క రోజులోనే రూ.9,322 కోట్ల పెట్టుబడులతో 30 ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, ఒప్పందాలు జరిగాయని, వీటి ద్వారా సుమారు 80 వేల మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. ప్రఖ్యాత అడిడాస్ ఫుట్‌వేర్ సంస్థతో పాటు టూ సీటర్ ట్రైనీ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ, డెయిరీ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు కుప్పానికి వస్తున్నాయని వెల్లడించారు.

**కాలుష్య రహిత, సుస్థిర అభివృద్ధి**

ఎస్సీ, ఎస్టీలకు సోలార్ రూఫ్‌టాప్ ద్వారా ఉచిత విద్యుత్, బీసీ, ఓసీలకు రూ.552 కోట్లతో సౌర విద్యుత్ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. 'నెట్ జీరో' విధానంలో భాగంగా ఇళ్లపైనే కూరగాయలు పండించుకోవడం, ఈ–సైకిళ్ల వాడకం పెంచి కుప్పాన్ని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కుప్పంలోని బ్లూ గ్రానైట్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని 'హెరిటేజ్ గ్రానైట్ క్లస్టర్' ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

**గత పాలనపై తీవ్ర విమర్శలు**

గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కుప్పంపై కక్ష కట్టిందని, అభివృద్ధిని అడ్డుకుందని చంద్రబాబు ఆరోపించారు. "నీళు తెచ్చామని సినిమా సెట్టింగులు వేసి డ్రామాలు ఆడారు. 2019–24 మధ్య నన్ను నా నియోజకవర్గంలోనే తిరగనివ్వకుండా అడ్డంకులు సృష్టించారు. నాకు సహకరించిన వారిని వేధించారు" అని మండిపడ్డారు. రాయలసీమలో ఫ్యాక్షన్ రాజకీయాలకు కాలం చెల్లిందని, ఇప్పుడు అభివృద్ధే తమ అజెండా అని స్పష్టం చేశారు. సంఘ విద్రోహ శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తానని



హెచ్చరించారు. వివేకానందరెడ్డి హత్య, కోడికత్తి డ్రామా, డాక్టర్ సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం ఘటనలను ప్రస్తావిస్తూ గత ప్రభుత్వంలో జరిగిన అరాచకాలను ఎండగట్టారు.

'మావిగన్' అంటూ గొడ్డలి పార్టీ వింత వాదన

రాజధానిపై గత ప్రభుత్వం రోజుకో మాట మాట్లాడిందని విమర్శించారు. ప్రజలందరూ అమరావతినే రాజధానిగా కోరుకుంటుంటే, 'గొడ్డలి పార్టీ' మాత్రం వాటికన్ తరహాలో 'మావిగన్' కావాలంటోందని ఎద్దేవా చేశారు. గొడ్డలి పార్టీ అని తాము అనడం కాదని, వారే అంగీకరిస్తున్నారని వ్యాఖ్యానించారు.

కుప్పం అభివృద్ధికి సుర్బానా జురాంగ్, ఐఐటీ కాన్పూర్ వంటి సంస్థల సహకారంతో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ఎలిఫెంట్ సఫారీ, రాక్ క్లైంబింగ్ వంటి ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజా భాగస్వామ్యంతో కుప్పాన్ని దేశంలోనే ఒక ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# 2029లో ఎన్నికల సమరానికి సిద్ధం

**ఏ రాజకీయ పార్టీ అనేది ప్రజల నిర్ణయం**

**మాజీ ఎమ్మెల్యే గురునాథరెడ్డి**

**పరిశ్రమలు,అభివృద్ధి, స్థానిక ఎన్నికలపై కీలక వ్యాఖ్యలు**

**అనంతపురం ప్రతినిధి, జూలై 04,(రిపబ్లిక్ న్యూస్ ):** 2029 అసెంబ్లీ ఎన్నికల్లో తాను తప్పకుండా పోటీ చేస్తానని మాజీ ఎమ్మెల్యే గురునాథరెడ్డి స్పష్టం చేశారు. అయితే ఏ రాజకీయ పార్టీ తరపున ఎన్నికల బరిలోకి దిగాలన్నది ప్రజల అభిప్రాయం, కుటుంబ సభ్యులు, అభిమానుల సూచనల మేరకే నిర్ణయిస్తానని తెలిపారు. శనివారం అరవింద్ నగర్ లోని స్వగృహంలో విలేకరుల సమావేశంనిర్వహించారు. రాష్ట్ర రాజకీయాలు, తాగునీరు, సాగునీటి సమస్యలు, అమరావతి రాజధాని, రాయలసీమ అభివృద్ధి,స్థానిక సంస్థల ఎన్నికలు, తదితర అంశాలపై ఆయన మాట్లాడారు.

**సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యం**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పరిశ్రమలు ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్నాయని, ముఖ్యంగా రాయలసీమలో కొత్త పరిశ్రమలు ఏర్పడితే యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తేనే రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, పారిశ్రామికీకరణ, రైతులకు సాగునీరు, ప్రజలకు



తాగునీరు, నిరుద్యోగ యువతకు ఉపాధి వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వలు తీవ్రంగా తగ్గిపోవడం అత్యంత ఆందోళనకరమని గురునాథరెడ్డి అన్నారు. దాదాపు తొమ్మిది టీఎంసీల మేర నీటి కొరత ఏర్పడటంతో అనంతపురం జిల్లాలో తాగునీరు, సాగునీటి సమస్యలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన వేళ రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, పంట రుణాలను సకాలంలో అందించడంతో పాటు ప్రత్యామ్నాయ సాగునీటి ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కృష్ణా నది జలాలను అనంతపురం జిల్లాకు మళ్లించి శాశ్వత పరిష్కారం చూపాలని, కేంద్ర ప్రభుత్వం కూడా రాష్ట్రానికి పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

కరువు ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పనికి ఆహార పథకాన్ని సమర్థంగా అమలు చేసి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచాలని అన్నారు. రైతులు, వ్యవసాయ కూలీలు ఇబ్బందులు పడకుండా అవసరమైన అన్ని చర్యలు ప్రభుత్వం చేపట్టాలని సూచించారు.

**రాజధాని నిర్మాణానికి అవసరమైన సహకారం అందించాలి**

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలు ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటారని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం అధికార కూటమికి అనుకూల వాతావరణం కనిపిస్తోందని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా ప్రభుత్వం మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.అమరావతినే రాష్ట్ర ఏకైక రాజధానిగా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని, రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహకారం అందించాలని కోరారు. మూడు రాజధానుల ప్రతిపాదనను ప్రజలు తిరస్కరించారని, ఇకపై రాజధాని విషయంలో ఎలాంటి సందిగ్ధత లేకుండా అమరావతి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అన్నారు.తన రాజకీయ భవిష్యత్తుపై స్పందిస్తూ, 2029 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడం ఖాయమని, అయితే ఏ పార్టీ నుంచి పోటీ చేయాలన్నది ప్రజల అభిప్రాయం మేరకే నిర్ణయిస్తానని గురునాథరెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యలను తెలుసుకుంటున్నానని, ప్రజల ఆశీర్వాదమే తనకు ముఖ్యమని, వారి నిర్ణయానికే తాను కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు.

# కేరాఫ్ ప్లాట్ ఫామ్ గాళ్లు ..

## నా గురించా మాట్లాడేది

**రాప్తాడులో తోపుదుర్తి రాజ్యాంగం నడిపిస్తా**

**మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఫైర్**

**మద్యం అక్రమ వసూళ్లు కోట్లకు పడగలెత్తిన అమిలినేని**

**చెప్పుల షాపులో పనిచేసి ..**

**7 కోట్ల విల్లా ఎలా ఎమ్.ఎస్ రాజు**

**వంద హత్యలు .. మూడు కూనీలు ఇదే సంస్కృతి శ్రీరామ్**

**అనంతపురం ప్రతినిధి, జూలై 04, (రిపబ్లిక్ న్యూస్):** కేరాఫ్ ప్లాట్ ఫామ్ గాల్లా నా గురించా మాట్లాడేది అని రాప్తాడులో తోపుదుర్తి రాజ్యాంగం నడిపిస్తానని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా మద్యం షాపుల ద్వారా ఒక్కో బాటిల్‌పై అదనంగా రూ.50 చొప్పున వసూలు చేస్తూ భారీ అక్రమ సంపాదనకు పాల్పడ్డారని, ఆ డబ్బుతో టీడీపీ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు వేల కోట్లకు పడగలెత్తారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మండిపడ్డారు. శనివారం అనంతపురంలోని హెచ్‌ఎల్‌సీ కాలనీలో ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన టీడీపీ ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, ఎంఎస్ రాజు, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. చెప్పుల షాపులో పనిచేసిన వ్యక్తి నేడు ఏడు కోట్ల రూపాయల విల్లాలో ఎలా సాధ్యమైందో ప్రజలకు సమాధానం చెప్పాలని ఎంఎస్ రాజును నిలదీశారు. బెంగళూరుతో పాటు వివిధ ప్రాంతాల్లో కోట్ల రూపాయల విలువైన ఆస్తులు ఎలా




వచ్చాయో వెల్లడించాలని డిమాండ్ చేశారు. మడకశిరలో గుండుమలకు ఎంఎస్ రాజు గుండు కొట్టారని ఎద్దేవా చేశారు.తాము భూస్వాముల కుటుంబానికి చెందిన వారమైనప్పటికీ ఇప్పటికీ అద్దె ఇళ్లలోనే నివసిస్తూ సాధారణ ప్రజల మధ్య జీవిస్తున్నామని పేర్కొన్నారు. సురేంద్రబాబు కేర్ ఆఫ్ ప్లాట్ ఫామ్ గాడివి నువ్వా నా గురించి మాట్లాడేది అంటూ తీవ్రంగా హెచ్చరించారు. అమిలినేని సురేంద్రబాబు ఎవరి బినామీగా పనిచేస్తున్నారో ప్రజలకు తెలుసని, మద్యం వ్యాపారాల ద్వారా భారీగా అక్రమ సంపాదన చేసి వందల కోట్ల ఆస్తులు కూడబెట్టారని ఆరోపించారు. జాతీయ రహదారులు, కాలువల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనుల్లో భారీ అవకతవకలు జరిగాయని, రూ.90 కోట్ల పనులకు రూ.200 కోట్ల బిల్లులు సృష్టించి ప్రజాధనాన్ని దోచుకున్నారన్నారు. బాగా తిని బలుసు సురేంద్ర బాబు కారం పట్టించి కోసి పంచుతాం గుర్తు పెట్టుకో ఖబడ్దార్ అని హెచ్చరించారు.

**దాడులు, హత్యలకు అధికార పార్టీదే బాధ్యత**

తాను అగరొత్తులు పెట్టడానికి చమన్ సాబ్‌ను కాదని, జిల్లాలో వందల హత్యలు, మూడు కూనీలు, అత్యాచారాలు, దాడులు, దౌర్జన్యాల సంస్కృతికి పరిటాల కుటుంబమే కారణమన్నారు. ఇన్ని హత్యలు జరిగినప్పటికీ కూడా పరిటాల వాళ్లకు శిక్ష పడలేదన్నారు. అందులో భాగంగానే పరిటాల వాళ్ళు పరిటాల పేరు చెప్పంది పూట గడవదని ఎద్దేవా చేశారు.అయితే వారు అధికారాన్ని అడ్డు పెట్టి రాజకీయాలు చేస్తున్నారని, పరిటాల పేరు చెప్పుకొని రాజకీయాలు చేసే రోజులు ముగిసిపోయాయని ఆయన అన్నారు. జిల్లాలో జరుగుతున్న హత్యలు, దాడులు, మహిళలపై అత్యాచారాలు, సామాన్య ప్రజలపై దౌర్జన్యాలకు అధికార పార్టీ నాయకత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.సివిల్ సప్లైతో పాటు పలు ప్రభుత్వ శాఖల్లో అధికార పార్టీ అనుచరులకు కాంట్రాక్టులు కట్టబెట్టి ప్రజాధనాన్ని దోచుకుంటున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన జాతీయ రహదారి ప్రాజెక్టుల్లో కూడా పెద్ద ఎత్తున అవినీతి జరిగింద అన్నారు.2029 ఎన్నికల్లో ప్రజల తీర్పుతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుంది. ఆ తరువాత తోపుదుర్తి రాజ్యాంగం అమలుచేస్తాం గుర్తుంచుకో అమిలినేని అంటూ తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి హెచ్చరించారు. దీంతో పాలకపక్షాల నాయకులు ప్రతిపక్షాల నాయకులు ఒకరిపై మరొకరు తీవ్ర విమర్శలు జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. అయితే రాప్తాడు నియోజకవర్గం, కళ్యాణ దుర్గం నియోజకవర్గం, మడకశిర నియోజకవర్గం తోపాటు ధర్మవరం రాజకీయాలు వేడెక్కాయి.

# విద్య, ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి

**ఏపీఎస్‌సీపీసీఆర్ సభ్యుడు డా. డి. శ్రీనివాసమూర్తి**





**శ్రీ సత్య సాయి/ తనకల్లు, జూలై 04,(రిపబ్లిక్ న్యూస్):** గిరిజన విద్యార్థుల విద్య, ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఏపీఎస్‌సీపీసీఆర్) సభ్యుడు డా. డి. శ్రీనివాసమూర్తి అన్నారు. శ్రీ సత్య సాయి జిల్లా కదిరి నియోజకవర్గంలోని తనకల్లు మండల (ఎస్టీ) గిరిజన పాఠశాలను శనివారం ఆయన సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు, విద్యా ప్రమాణాలు, హాస్టల్ వసతులు, ఆహార నాణ్యత, తాగునీరు, పారిశుద్ధ్యం, ఆరోగ్య సేవలు, భద్రతా ఏర్పాట్లపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వంటశాల, స్టోర్‌రూమ్, తరగతి గదులు, వసతి గృహాలను పరిశీలించారు.

**ఃవిద్యార్థుల సంక్షేమం విషయంలో నిర్లక్ష్యాన్ని సహించబోం**

గిరిజన విద్యార్థుల్లో ప్రతిభ అపారంగా ఉందని, వారికి నాణ్యమైన విద్య, పోషకాహారం, సురక్షిత వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని డా. శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించి డాక్టర్లు, ఇంజనీర్లు, సివిల్ సర్వెంట్లు, ప్రజాప్రతినిధులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి విద్యార్థికి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.బాల్య వివాహాల నివారణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, మాదకద్రవ్యాల నివారణ, పోక్సో చట్టంపై విద్యార్థులు, సిబ్బందికి నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గిరిజన విద్యార్థుల సంక్షేమం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, పిల్లల హక్కుల పరిరక్షణకు ఏపీఎస్‌సీపీసీఆర్ నిరంతరం పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## చెలిమిళ్ళ గ్రామంలో జరుగుతున్న ఎస్ఐఆర్ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించిన వైఎస్ఆర్సిపి ఆర్టిఐ మండల అధ్యక్షుడు ఎస్.శివలింగం



**పాములపాడు జూలై-4 రిపబ్లిక్ న్యూస్:-** వైస్సార్సీపీ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్దార్థ రెడ్డి, నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ దారా సుధీర్ ఆదేశాల మేరకు మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా పాములపాడు మండలంలోని, చెలిమిల్ల గ్రామములో వైస్సార్సీపీ ఆర్ టి ఐ మండల అధ్యక్షులు ఎస్.శివలింగం సచివాలయంలో బిఎల్ఓ జాహిద్ తో సర్వే ఇంతవరకు జరిగిందనీ అడిగి తెలుసుకోవడం జరిగింది.బూత్ నంబర్ 213,మరియు 214 ల లోని ఎన్ని డిజిటేషన్ లను అప్లోడు చేశారు అని అడగడం జరిగింది.బూత్ నంబర్ 213 లో 637 కు గాను, 420 డిజిటలేషన్ చేయడం జరిగిందన్నారు. బూత్ నంబర్- 214లో 620కి గాను, 250 డిజిటలేషన్ చేయాడం జరిగిందన్నారు. ఇంకా మిగిలినవి కూడా రెండు రోజులలో పూర్తి చేయడం జరుగుతుందనీ బిఎల్వోలు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి ఆర్.టి.ఐ మండల అధ్యక్షుడు ఎస్.శివలింగం ఎస్ఐఆర్ ఫారాలను పరిశీలించడం జరిగింది. చెలిమిళ్ళ గ్రామపంచాయతీలోని ఎవరి ఓట్లు కూడా ఎస్ఐఆర్ సర్వేలో పోకుండా చూడాలని బివోల్వోలను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఎల్వోలు, బిఎల్ఎ లు, వైసిపి కార్యకర్త దేవిడ్, తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఆలయ నిర్మాణానికి రూ.1.50 లక్షల విరాళం





**శ్రీ సత్య సాయి / మడకశిర, జూలై 04,(రిపబ్లిక్ న్యూస్)** మడకశిర పట్టణంలోని శ్రీ పశువుల ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి ధర్మస్థలం ట్రస్ట్ రూ.1.50 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించింది. ట్రస్ట్ మేనేజర్ మహేష్ శనివారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ దేవాలయ నిర్మాణానికి ధర్మస్థలం ట్రస్ట్ అందించిన విరాళం అభినందనీయమన్నారు. సమాజ సేవతో పాటు ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలకు ట్రస్ట్ నిరంతరం అండగా నిలుస్తోందని తెలిపారు. ట్రస్ట్ అధ్యక్షుడు డా. డి. వీరేంద్ర హెగ్డే సేవలను కొనియాడుతూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ట్రస్ట్ అందించిన రూ.1.50 లక్షల విరాళంతో దేవాలయ నిర్మాణ పనులు మరింత వేగవంతమవుతాయని పేర్కొన్నారు. ఆలయ నిర్మాణానికి దాతలు, భక్తులు కూడా తమ వంతు సహకారం అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ధర్మస్థలం ట్రస్ట్ ప్రతినిధులను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

## కర్నూలులో శాంతి భద్రతల పరిరక్షణకు సెక్షన్30 పోలీసు యాక్ట్ అమలు

**జులై 31 వరకు ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలకు అనుమతి లేదు కర్నూలు డీఎస్పీ రాఘవేంద్ర**



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 4)** కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు కర్నూలు నగరం, గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా ప్రశాంతత దృష్ట్యా భారతీయ పోలీస్ చట్టం1861లోని సెక్షన్30 పోలీసు యాక్ట్ ఉత్తర్వులు అమల్లో ఉన్నట్లు కర్నూలు డీఎస్పీ రాఘవేంద్ర తెలిపారు. కర్నూలు సబ్ డివిజన్ పరిధిలో తరచుగా జరుగుతున్న ధర్నాలు, ఆందోళనలు, రాస్తారోకోలు తదితర కార్యక్రమాల వల్ల శాంతిభద్రతలకు భంగం కలిగే అవకాశం ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు సెక్షన్30 పోలీసు యాక్ట్ కింద ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.ముందస్తు లిఖితపూర్వక అనుమతి లేకుండా ప్రజా సమావేశాలు, ధర్నాలు, ఆందోళనలు, రాస్తారోకోలు, ఊరేగింపులు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. అనుమతుల కోసం నిర్వాహకులు ముందుగానే సంబంధిత పోలీసు అధికారులను సంప్రదించి లిఖితపూర్వక అనుమతి పొందాలని సూచించారు.ఈ ఉత్తర్వులు జులై 31, 2026 వరకు కర్నూలు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో అమల్లో ఉంటాయని డీఎస్పీ రాఘవేంద్ర తెలిపారు.

## రజక సంఘం రాష్ట్ర చైర్మన్ సావిత్రి కి ఘన సన్మానం



**అనంతపురం/ గుత్తి, జూలై 04: (రిపబ్లిక్ న్యూస్)** ఈ నెల 12వ తేదీన జరగనున్న రజకుల ఆకాంక్ష సభ ఏర్పాట్లను పరిశీలించేందుకు గుత్తికి విచ్చేసిన రజక సంఘం రాష్ట్ర చైర్మన్ సావిత్రి, గుత్తి భారతీయ జనతా పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆకాంక్ష సభ ఏర్పాట్లపై చర్చించి, సభను విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. రజక సమాజం ఐక్యంగా పాల్గొని సభను విజయవంతం చేయాలని సావిత్రి పిలుపునిచ్చారు.బీజేపీ నాయకులు మాట్లాడుతూ రజకుల అభ్యున్నతికి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి తమ పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. అనంతరం సావిత్రి కి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు, రజక సంఘం నాయకులు, కార్యకర్తలు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రీయ విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపీ బస్తిపాటి నాగరాజు

**విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులపై సమీక్ష**

**ఇష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని విద్యార్థులకు సూచన**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 4)**కర్నూలు నగరంలోని నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలో ఉన్న కేంద్రీయ విద్యాలయాన్ని ఎంపీ బస్తిపాటి నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. తరగతి గదులను సందర్శించిన ఎంపీ విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించారు. వారు ఎలా చదువుతున్నారు, భవిష్యత్తులో ఏ రంగంలో స్థిరపడాలని లక్ష్యంగా పెట్టుకున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. కష్టంగా కాకుండా ఇష్టపడి చదివితేనే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకుని దానికోసం క్రమశిక్షణతో కృషి చేయాలని ప్రోత్సహించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, సిబ్బందితో మాట్లాడిన ఎంపీ విద్యార్థులకు మరింత నాణ్యమైన, అనుభవపూర్వకమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే పాఠశాలలో మౌలిక సదుపాయాల విషయంలో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

# త్రిబుల్ ఐటీ విద్యార్థికి ఎమ్మెల్యే దగ్గుపాటి చేయూత



**అనంతపురం సంక్షేమం, జూలై 04,(రిపబ్లిక్ న్యూస్):**

ప్రతిభావంతుడైన ఓ విద్యార్థి ఉన్నత చదువులకు అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అండగా నిలిచారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా త్రిబుల్ ఐటీలో చేరినా విద్యను కొనసాగించలేని పరిస్థితిని ఎదుర్కొంటున్న కార్తీక్‌కు ఎమ్మెల్యే చొరవతో రూ.40 వేల ఆర్థిక సాయం అందడంతో అతని విద్యాభ్యాసానికి భరోసా లభించింది. అనంతపురం నగరంలోని వెంకటరెడ్డి కాలనీకి చెందిన కార్తీక్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో 581 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచాడు. ప్రభుత్వ పాఠశాలల్లో 580కు పైగా మార్కులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్వయంగా కార్తీక్‌ను సన్మానించి రూ.10 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. అనంతరం కార్తీక్‌కు ఇడుపులపాయ త్రిబుల్ ఐటీలో ప్రవేశం లభించినప్పటికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యం కావడంతో విద్య కొనసాగించడం కుటుంబానికి భారంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, నగర ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్ విద్యార్థి పరిస్థితిని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కార్తీక్ చదువు ఆగిపోకుండా చూడాలని నిర్ణయించి ఆర్యవైశ్య సంఘం నాయకులతో మాట్లాడి ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే పిలుపుకు వెంటనే స్పందించిన ఆర్యవైశ్య సంఘం నాయకులు దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా కార్తీక్ విద్యాభ్యాసానికి అవసరమైన రూ.40 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులు కేవలం ఆర్థిక ఇబ్బందుల వల్ల ఉన్నత విద్యకు దూరం కాకూడదని, అలాంటి వారికి సమాజంలోని ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్రతిభకు అవకాశాలు కల్పించినప్పుడే రాష్ట్ర భవిష్యత్తు మరింత బలపడుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ప్రతిభావంతులైన ప్రతి విద్యార్థికి అవసరమైన సహకారం అందేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. తన చదువు ఆగిపోతుందేమోనన్న ఆందోళనలో ఉన్న సమయంలో అండగా నిలిచిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌తో పాటు ఆర్యవైశ్య సంఘం నాయకులకు కార్తీక్, అతని కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# 22వ వార్డులో ఎస్ఐఆర్

**అనంతపురం/గుత్తి, జూలై 04: (రిపబ్లిక్ న్యూస్)**



గుత్తి పట్టణంలోని 22వ వార్డులో ఎస్ఐఆర్ (ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల జాబితా సవరణలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు పాల్గొని తమ ఓటరు వివరాలను పరిశీలించి అవసరమైన దరఖాస్తులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్ సుంకన్న, డీలర్ వీరన్న గౌడ్ పాల్గొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేర్లను పరిశీలించుకొని అవసరమైతే సవరణలు చేసుకోవాలని వారు సూచించారు. ప్రజలు కార్యక్రమానికి మంచి సహకారం అందించగా, అధికారులు సూచించిన విధంగా అవసరమైన పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**నారాయణఖేడ్ నియోజకవర్గం ప్రతినిధి జులై 4( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**

కంగ్టి మండలం తడ్కల్ గ్రామానికి చెందిన శంకర్ గారి తండ్రి గారు ఇటీవల మరణించిన విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి వారిని పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని చెప్పిన గౌరవ నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి గారు వారితోపాటు సర్పంచులు మాణిక్ రెడ్డి, లాల్ కుమార్, దర్జీ రమేష్, తదితరులు ఉన్నారు.



# సంక్షేమ హాస్టళ్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**జిల్లా ప్రధాన కార్యదర్శి జి. వీరేంద్ర ప్రసాద్ డిమాండ్ -పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా**

**అనంతపురం కలెక్టరేట్, జూలై 04,(రిపబ్లిక్ న్యూస్):**
జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి జి. వీరేంద్ర ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ధర్నా నిర్వహించారు.

**డైనింగ్ హాళ్లు లేక బయటే భోజనం చేయాల్సిన పరిస్థితి నెలకొంది**

ఈ సందర్భంగా జి. వీరేంద్ర ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో 50కు పైగా ఎస్సీ, 50కు పైగా బీసీ సంక్షేమ హాస్టళ్లలో వేలాది మంది విద్యార్థులు చదువుకుంటున్నప్పటికీ కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మెస్, కాస్మెటిక్ చార్జీలను పెంచాలని విద్యార్థులు, తల్లిదండ్రులు ఎన్నిసార్లు కోరినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. చాలా హాస్టళ్లలో డైనింగ్ హాళ్లు లేక విద్యార్థులు ఎండ, వాన, చలిలో బయటే భోజనం చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి హాస్టల్‌లో డైనింగ్ హాల్ నిర్మించడంతో పాటు బాత్రూమ్‌ల సంఖ్యను పెంచాలని, విద్యార్థులకు తగిన వసతులు కల్పించాలని కోరారు.
ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇప్పటికీ విడుదల




కాకపోవడంతో బీటెక్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

**రూ.7,200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి**

కళాశాలలు ఫీజులను విద్యార్థుల నుంచే వసూలు చేసేందుకు ఒత్తిడి చేస్తున్నాయని, పెండింగ్‌లో ఉన్న రూ.7,200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి జీవో నెం.77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2026-27 విద్యా సంవత్సరం ప్రారంభమై 20 రోజులు దాటినా ఇప్పటికీ విద్యార్థులకు రాధాకృష్ణ కిట్లు అందించలేదని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి ప్రతి విద్యార్థికి కిట్లు అందించాలని కోరారు.



**బయట గదులు అద్దెకు తీసుకుని చదువుకోవాల్సి వస్తోంది**

అనంతపురం వంటి కరువు జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు లక్షల రూపాయల ఫీజులు, వేల రూపాయల పుస్తకాల ధరలు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మార్చాయని ఆరోపించారు. చైతన్య, నారాయణ, భాష్యం, ఎస్సార్ తదితర విద్యాసంస్థల్లో ఫీజులను ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారని , ప్రభుత్వం వెంటనే ఫీజు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జిల్లాలోని ఐటీఐ కళాశాలలకు అనుబంధ హాస్టళ్లు లేక విద్యార్థులు బయట గదులు అద్దెకు తీసుకుని చదువుకోవాల్సి వస్తోందని, వెంటనే ఐటీఐ కళాశాలలకు హాస్టల్ సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు వంశీ, నాగచైతన్య, హరీష్, ధనుష్, ఎన్. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం..

**ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనపై కర్నూలు పోలీసుల కఠిన చర్యలు**

**ఆరు నెలల్లో 21,977 ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు నమోదు ప్రతి శనివారం రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు**

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 4)**
రహదారి ప్రమాదాలను తగ్గించి ప్రజల ప్రాణాలను కాపాడడమే ప్రధాన లక్ష్యంగా కర్నూలు జిల్లా పోలీసులు ట్రాఫిక్ నిబంధనల అమలులో కఠిన చర్యలు తీసుకుంటున్నారు. కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, ఐపీఎస్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.
2026 జనవరి 1 నుంచి జూన్ 30 వరకు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై జిల్లా పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి మొత్తం 21,977 ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు నమోదు చేశారు.
నమోదైన కేసుల వివరాలు ఇలా ఉన్నాయి:
ఓవర్ స్పీడ్ 4,302



హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ 3,272
సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ 1,303
డ్రంకెన్ డ్రైవింగ్ 4,464
ఓపెన్ డ్రింకింగ్ 8,274 మైనర్ డ్రైవింగ్ 56ట్రిపుల్ రైడింగ్ 306 ఈ సందర్భంగా జిల్లా పోలీసులు ప్రజలకు పలు సూచనలు చేశారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని విజ్ఞప్తి చేశారు.
ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో మరింత అవగాహన





పెంపొందించి రహదారి ప్రమాదాలను తగ్గించేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని జిల్లా పోలీసులు తెలిపారు.

# నదుల పరివాహక ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలి

**: కమిషనర్ చల్లా ఓబులేసు**

**నదీ తీరాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు**

**ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన పెంచాలని అధికారులకు ఆదేశాలు**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 4)**
నగర పరిధిలోని నదుల పరివాహక ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన పెంపొందించేలా చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అధికారులను ఆదేశించారు.
సంకల్‌బాగ్ వద్ద తుంగభద్ర నది, రాజ్ విహార్ వద్ద హంద్రీ నది, వినాయక ఘాట్ నుంచి జొహరపురం వరకు కే.సీ. కెనాల్ ఉపనది పరివాహక ప్రాంతాలను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతిరోజూ వాకింగ్‌కు వచ్చే ప్రజలకు నదీ తీరాలు పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. నదుల్లో, నదీ తీరాల్లో చెత్త




వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, ఇంటింటి చెత్త సేకరణలో ఎలాంటి లోపాలు లేకుండా పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు.
అనంతరం సంకల్‌బాగ్‌లోని మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించిన కమిషనర్, ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలోని అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడి నిర్వహణను సమీక్షించారు.
ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అనిల్ కుమార్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





# రిటైర్మెంట్ వయస్సు పెంపు జీవోను వెంటనే రద్దు చేయాలి: ఏఐవైఎఫ్

**ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా ఉద్యోగాలను కాపాడుకోవడం నిరుద్యోగ యువత భవిష్యత్తుపై దాడి**

**ప్రభుత్వం నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరిక**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 4)**
ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోను వెంటనే రద్దు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు జీ. సంతోష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి ఎం. యుగంధర్ డిమాండ్ చేశారు. కర్నూలులోని సీపీఐ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, రాష్ట్రంలో లక్షలాది మంది చదువుకున్న నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న సమయంలో రిటైర్మెంట్ వయస్సు పెంచడం వారి భవిష్యత్తును బలి చేసే నిర్ణయమని విమర్శించారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా పదవీ విరమణ వయస్సు పెంచడం పూర్తిగా యువత వ్యతిరేక చర్య అని ఆరోపించారు. ప్రభుత్వం కొత్త ఉద్యోగాలను సృష్టించాల్సింది పోయి, ఇప్పటికే పదవీ విరమణ చేసిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకురావాలని




నిర్ణయించడం మరింత ఆందోళన కలిగించే విషయమని పేర్కొన్నారు. ఒకవైపు నిరుద్యోగ భృతి, ఉద్యోగాల హామీలు ఇస్తూ మరోవైపు యువతకు దక్కాల్సిన ఉద్యోగ అవకాశాలను అడ్డుకోవడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.
రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు వేలాది ఖాళీ పోస్టులతో సిబ్బంది కొరతను ఎదుర్కొంటున్నాయని, అలాంటి సమయంలో కొత్త నియామకాలు చేపట్టకుండా రిటైర్మెంట్ వయస్సు పెంచడం ప్రజా ప్రయోజనాలకు కూడా విరుద్ధమని అన్నారు.
యువత ఉపాధి హక్కును కాలరాసే ఈ జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని, అన్ని శాఖల్లో ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేసి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ల ముట్టడులు, ధర్నాలు, రాస్తారోకోలు తదితర ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.
ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు, జిల్లా సహాయ కార్యదర్శి రాజు, నగర అధ్యక్షుడు నాగరాజు, నగర నాయకులు చంటి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరి, వివేకానంద, పింగళి వెంకయ్యకు నివాళి



**అనంతపురం/గుత్తి, జూలై 04: (రిపబ్లిక్ న్యూస్)**

గుత్తి పట్టణంలోని పెన్షనర్ల భవనంలో అల్లూరి సీతారామరాజు 129వ జయంతి, స్వామి వివేకానంద 124వ వర్ధంతి, పింగళి వెంకయ్య 63వ వర్ధంతి కార్యక్రమాన్ని పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అబూబాకర్, కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు, స్వామి వివేకానంద, పింగళి వెంకయ్య చిత్రపటాలకు జెన్నే కుల్లాయిబాబు, జాయింట్ సెక్రటరీ విజయలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో లక్ష్మీనారాయణరెడ్డి మాట్లాడుతూ పింగళి వెంకయ్య భారత జాతీయ పతాక రూపకర్తగా దేశానికి విశిష్ట సేవలు అందించారని తెలిపారు. కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు త్యాగస్ఫూర్తి, స్వామి వివేకానంద యువతకు అందించిన స్ఫూర్తిని కొనియాడారు. దేశభక్తి, సేవాభావం, త్యాగం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రామ్‌మోహన్, గౌరవాధ్యక్షులు ఫక్రుద్దీన్, షైక్షావలి, లక్ష్మీనారాయణరెడ్డి, వెంకటేష్, నారాయణశెట్టి, హస్సన్ అహమ్మద్, మద్దులేటి, చెన్నారెడ్డి, నరసింహులు, రాజేంద్రప్రసాద్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ నినో ప్రభావంపై అవగాహన ర్యాలీ



**చౌడేపల్లి ప్రతినిధి జూలై 04 రిపబ్లిక్ న్యూస్**

ఎల్ నీనో ప్రభావం పై మండల వ్యవసాయ శాఖ అధికారి మోహన్ కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మోహన్ కుమార్ ప్రసంగిస్తూ ఈ సంవత్సరం ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదవుతుందన్నారు వడగాలులు ఎక్కువగా ఉంటాయన్నారు దీనిని ఎదుర్కోవడానికి వరి సాగుకు బదులుగా తక్కువ కాలంలో పండే,బెట్ట పరిస్థితులను ఎదుర్కొనే జొన్న, సజ్జ, రాగులు లాంటి పంటలను సాగు చేసుకోవాలన్నారు . ప్రీ మన్సూన్ డ్రై సోయింగ్ వర్షాలకు ఒకటి రెండు వారాల ముందే పొడి నేలలో విత్తనాలు నాటడం వల్ల వేర్లు బలంగా పెరిగి బెట్టను తట్టుకుంటాయన్నారు ఈ కార్యక్రమంలో ఎస్టి రైతులకు 50% సబ్సిడీ కింద కంది విత్తనాలు అందజేయడం జరిగిందన్నారు బోరు బావులు కలిగిన రైతులు డ్రిప్ ఇరిగేషన్ ప్రభుత్వం ఇచ్చే రాయితీతో డ్రిప్పు పరికరాలు అమర్చుకొని తక్కువ నీటితో ఎక్కువ సాగు చేసుకోవచ్చని అధిక దిగుబడి పొందవచ్చని తెలియజేశారు. ర్యాలీలో వ్యవసాయ డి ఆర్ డి ఏ ఏపిఎం సుబ్రమణ్యం సంఘమిత్ర సభ్యులు రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా వంగవీటి జయంతి వేడుకలు

### కాపు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన నివాళులు

**కేక్ కట్ చేసి సేవా కార్యక్రమాల నిర్వహణ - "మన" అధ్యక్షులు ఆరిగెల మనోహర్**



**విశాఖపట్నం ప్రతినిధి, జూలై 04,(రిపబ్లిక్ న్యూస్):**



బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, ప్రజానాయకుడు స్వర్గీయ వంగవీటి మోహన రంగా 79వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశాఖ కాపు అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం విశాఖపట్నంలోని అసోసియేషన్ కార్యాలయంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. అనంతరం సమాజ సేవ, ప్రజా సంక్షేమం కోసం ఆయన చేసిన పోరాటాలను స్మరించుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బలిజ కాపు నాయకులు, "మన" అధ్యక్షులు ఆరిగెల మనోహర్ మాట్లాడుతూ వంగవీటి రంగా జీవితమంతా అణగారిన వర్గాల సంక్షేమానికే అంకితమైందని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే ఆయన రాజకీయ జీవిత లక్ష్యమని, నేటి యువత రంగా ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. కుల, మతాలకు అతీతంగా ప్రజల కోసం పనిచేసిన నాయకుడిగా రంగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. విశాఖ కాపు అసోసియేషన్ అధ్యక్షులు మద్దింశెట్టి సురేష్ మాట్లాడుతూ రంగా ఆశయాలు సమాజానికి ఎప్పటికీ మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషిని భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆయన చూపిన సేవా మార్గంలోనే విశాఖ కాపు అసోసియేషన్ నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో విశాఖ కాపు అసోసియేషన్ కమిటీ సభ్యులు, కాపు సంఘ నాయకులు, యువజన ప్రతినిధులు, మహిళా సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వంగవీటి రంగాకు ఘన నివాళులర్పించారు.

# రాయలసీమ అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలి

**: జగన్‌కు టీడీపీ సవాల్ -చంద్రబాబు హయాంలోనే రాయలసీమకు పరిశ్రమలు, సాగునీటి ప్రాజెక్టులు, ఉపాధి అవకాశాలు**

**కర్నూలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షురాలు గుడిసె ఆదికృష్ణమ్మ**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 4)**

రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాయలసీమ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై, అలాగే 20192024 మధ్య మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని కర్నూలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆదికృష్ణమ్మ సవాల్ విసిరారు.

కర్నూలులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆకుపోగు ప్రభాకర్, కైపా పద్మలత రెడ్డి, వై. నాగేశ్వరరావు యాదవ్, మీన్నప్ప తదితర నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాయలసీమను పారిశ్రామికంగా అభివృద్ధి చేయడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. ఇందులో భాగంగా కడప జిల్లా జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లిలో రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి పూజా కార్యక్రమాలు నిర్వహించామని, రెండు దశల్లో రూ.16,350 కోట్ల వ్యయంతో ఫ్యాక్టరీని పూర్తి చేసి వేలాది మంది యువతకు ఉద్యోగాలు కల్పించనున్నట్లు




చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రెండు సార్లు శంకుస్థాపనలు చేసినప్పటికీ ఐదేళ్ల పాలనలో ప్లాంట్ నిర్మాణంలో ఎలాంటి పురోగతి సాధించలేదని విమర్శించారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం తొలి దశకు రూ.4,500 కోట్లు, రెండో దశకు రూ.11,850 కోట్లు కేటాయించి పనులను వేగవంతం చేస్తోందన్నారు. ఈ పరిశ్రమ దక్షిణ భారతదేశంలోనే తక్కువ కార్బన్ ఉద్గారాలతో ఉక్కు ఉత్పత్తి చేసే ఆధునిక పరిశ్రమగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాయలసీమ సాగు, తాగునీటి అవసరాల కోసం భారీగా నిధులు కేటాయించిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిదేనని ఆమె అన్నారు. హంద్రీనీవా విస్తరణ, తుంగభద్ర, గోరకల్లు, శ్రీశైలం తదితర ప్రాజెక్టుల అభివృద్ధికి వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం రాయలసీమ ఉక్కు ఫ్యాక్టరీకి ప్రహరీ గోడ కూడా నిర్మించలేకపోయిందని విమర్శించారు. చంద్రబాబు హయాంలో కియా మోటార్స్, రాయల్ ఎన్‌ఫీల్డ్ వంటి పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చాయని, కర్నూలుకు హైకోర్టు బెంచ్ కూడా త్వరలో రానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో అమర్‌రాజా వంటి పరిశ్రమలు రాష్ట్రం విడిచి వెళ్లే పరిస్థితులు ఏర్పడ్డాయని ఆరోపించారు. అమరావతే రాష్ట్ర ఏకైక రాజధానిగా కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేసిన ఆదికృష్ణమ్మ, జగన్ తరచూ రాజధానిపై భిన్న వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని విమర్శించారు. 2029 ఎన్నికల్లో కూడా అమరావతి రాజధాని నినాదంతోనే ప్రజల ముందుకు వెళ్తామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడే సూచనలు ఉంటే ప్రభుత్వం స్వీకరించేందుకు సిద్ధంగా ఉందని, అనవసర విమర్శలు, చౌకబారు రాజకీయాలు మానుకోవాలని వైసీపీ నాయకులకు ఆమె సూచించారు. ఈ సమావేశంలో సత్రం రామకృష్ణుడు, హనుమంతరావు చౌదరి, పి. రవికుమార్ తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం కావాలి

**ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలే బుద్ధి చెబుతారు: ఏఐసీసీ కార్యదర్శి గణేష్ కుమార్ యాదవ్**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 4)**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికుడిలా పనిచేసి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని, కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని గణేష్ కుమార్ యాదవ్ పిలుపునిచ్చారు. కర్నూలులోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కాంగ్రెస్ సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు త్వరలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. బీజేపీ మతతత్వ రాజకీయాలకు పాల్పడుతోందని, కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొంటోందని విమర్శించారు.

విద్యార్థుల పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలు కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియ వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. జిల్లా, మండల కమిటీలను త్వరగా పూర్తి చేసి ప్రజాక్షేత్రంలోకి వెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. సమావేశంలో పాల్గొన్న మస్తాన్ వలి



మాట్లాడుతూ రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని, ప్రచారాలు తప్ప అభివృద్ధి కనిపించడం లేదని కూటమి ప్రభుత్వాన్ని విమర్శించారు. ఈ కార్యక్రమానికి మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సమావేశానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు క్రాంతి నాయుడు బోయ అధ్యక్షత వహించారు. టోల్‌గేట్ వద్ద గణేష్ కుమార్ యాదవ్, మస్తాన్ వలికి పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారిని జిల్లా కాంగ్రెస్ కార్యాలయానికి తీసుకువెళ్లగా



మహిళా కార్యకర్తలు పూలతో ఆహ్వానించారు. కార్యక్రమం అనంతరం గణేష్ కుమార్ యాదవ్, మస్తాన్ వలి, చింతా మోహన్‌లను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు క్రాంతి నాయుడు బోయ ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఎం. సుధాకర్ బాబు, ఏఐసీసీ కార్యదర్శి నాగ మధు యాదవ్, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చౌడేపల్లిలో ఘనంగా డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల ర్యాలీ

**చౌడేపల్లి ప్రతినిధి జులై 4 రిపబ్లిక్ న్యూస్**

డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రతతోనే ఈ వ్యాధిని అరికట్టవచ్చని చౌడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ మోనా పేర్కొన్నారు. శనివారం పుంగనూరు సబ్ యూనిట్ పరిధిలో గల చౌడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు డాక్టర్ మోనా ఆధ్వర్యంలో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా భారీ ర్యాలీ మరియు ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు.




ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ, జూలై 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలు జరుగుతాయని తెలిపారు. డెంగ్యూ అనేది 'ఏడిస్' రకం దోమలు కుట్టడం వల్ల వచ్చే ప్రమాదకరమైన వైరల్ జ్వరమని, దీనివల్ల తీవ్రమైన ఒళ్ళు నొప్పులు, రక్తంలో ప్లేట్‌లెట్ల సంఖ్య పడిపోవడం జరుగుతుందని హెచ్చరించారు. దోమ కుట్టిన 4 నుండి 10 రోజులలో 104-105 డిగ్రీల వరకు ఆకస్మిక అధిక జ్వరం రావడం, తీవ్రమైన తలనొప్పి, కళ్ళ వెనుక నొప్పి, కీళ్ళ-కండరాలలో భరించలేని నొప్పులు (ఎముకలు విరిగినట్లు అనిపించడం), వాంతులు, వికారం, శరీరంపై ఎర్రటి దద్దుర్లు రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

ఏడిస్ దోమలు మురికి నీటిలో కాకుండా, కేవలం స్వచ్ఛమైన నిల్వ ఉన్న నీటిలోనే పెరుగుతాయి. ఇండ్లల్లోని కూలర్లు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, పూల కుండీలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.

నిద్రపోయేటప్పుడు తప్పనిసరిగా దోమల తెరలు వాడాలి. ఒంటిని పూర్తిగా కప్పే దుస్తులు ధరించాలి. దోమలు కుట్టకుండా ఉండే క్రీములు, లోషన్లు ఉపయోగించాలి.

జ్వరం వచ్చిన వెంటనే సొంత వైద్యం (ఆర్ఎంపిలను ఆశ్రయించడం) చేయకుండా, వెంటనే ప్రభుత్వ వైద్యుడిని సంప్రదించి రక్త పరీక్షలు చేయించుకోవాలి. డెంగ్యూ సమయంలో శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా పండ్ల రసాలు, కొబ్బరి నీరు, మంచినీరు పుష్కలంగా తాగాలి. బొప్పాయి ఆకు రసం, కివీ పండ్లు, దానిమ్మ వంటివి తీసుకోవడం ద్వారా ప్లేట్‌లెట్ల సంఖ్యను వేగంగా పెంచుకోవచ్చని సూచించారు.

ఈ సదస్సులో డెంగ్యూతో పాటు మలేరియా, చికున్‌గున్యా, మెదడువాపు, బోధకాలు వంటి ఇతర సీజనల్ వ్యాధుల నివారణపై కూడా ప్రజలకు ఆరోగ్య విద్యను బోధించారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు సబ్ యూనిట్ అధికారి జి. గంగయ్య, పి.హెచ్.ఎన్ గంగులమ్మ, సూపర్వైజర్ సుమతి, ల్యాబ్ టెక్నీషియన్ హేమంత్, ఫార్మసిస్ట్ జయమ్మ, ఏఎన్ఎంలు, ఎమ్ఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్



**మెదక్ జిల్లా ప్రతినిధి జులై 4 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**

మెదక్ జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో వివిధ గ్రూపులలో ఖాళీలను భర్తీ చేయుట కొరకు 06-07-2026 సోమవారం రోజున స్పాట్ అడ్మిషన్స్ తీసుకోవడం జరుగుతుంది కావున జిల్లాలోని వివిధ వర్గాల విద్యార్థులు తమ తమ వోరిజినల్ సర్టిఫికెట్స్ & జిరాక్స్ తీసుకొని 9:00 వరకు మెదక్ లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మరియు కళాశాల (గర్ల్స్)కు రావాలని వచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మెదక్ జిల్లా సమన్వయకర్త అయిన శ్రీమతి అనురాధ మేడం గారు తెలపడం జరిగింది

## వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి



**నారాయణఖేడ్ నియోజకవర్గ ప్రతినిధి జులై 4 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**

కంగ్టి మండల పరిధిలోని చాప్ట (బి ) గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దశరథ్ పటేల్ కూతురి వివాహ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి ఈ కార్యక్రమంలో సర్పంచులు,లాల్ కుమార్, మాణిక్ రెడ్డి, బలురామ్, శ్యామ్ రాథోడ్, మాజీ సర్పంచులు, బసప్ప, ప్రకాష్ మనోహర్, ఉప సర్పంచ్లు, విజయరావ్ పాటిల్, మాజీ ఎంపీటీసీలు, అంబాజీరావు పాటిల్, మండల పార్టీ నాయకులు, దత్తరావు పాటిల్, అంజయ్య చారి, ఈశ్వర్ రావ్ పాటిల్, దర్జీ రమేష్, కార్యకర్తలు అభిమానులు తదితరులు ఉన్నారు.

# సర్ కు రాజకీయ పార్టీలే సహకరించాలి!

**జూలై 4 రిపబ్లిక్ న్యూస్.**
సర్ ప్రక్రియతో ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పార్టీలు కంగారు పడుతున్నాయి. ఇబ్బడిముబ్బడిగా ఉన్న మద్దతుదారుల ఓట్లు పోతాయన్న భావనలో ఉన్నారు. ముఖ్యంగా ఆంధ్రావారిలో చాలామందికి తెలంగాణలో ఓటు ఉంది. దీనిపై వారు ఆందోళన చెందుతున్నారు. రెండు ఓట్లు ఉంటే తొలగించడం ఖాయం. అలాగే హైదరాబాద్,విజయవాడ లాంటి తదితర పట్టణాల్లో ఉన్నవారికి కూడా అటు సొంతూళ్లు, ఇక్కడా ఓట్లు ఉన్నాయి. వీటిని తొలగిస్తే ఎలా అన్న ఆందోళనలో ఉన్నారు. అన్నింటికి మించి పాతబస్తీ లోనే ఎక్కువ గందరగోళం కనిపిస్తోంది. ఇక్కడ తిష్టవేసిన రోహింగ్యాలతో పాటు, ఇతర దేశాల వారిని గుర్తించడం కొంచెం కష్టమే. ఇకపోతే అధికారులు రోజువారీ సమీక్ష చేస్తూ సర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటి వరకు ఎక్కడా ఎలాంటి పొరపాట్లు రాలేదు. నకిలీ ఓట్లను నిరోధించేందుకు పక్కాగా ఓ వ్యవస్థ అంటూ లేదు. ఆధార్, పాన్ కార్డులకు పర్మినెంట్ నంబర్ ఉంటోంది. కానీ ఓటుకు అలాంటిదేమీ లేదు. అలాంటి పక్కా వ్యవస్త ఉంటే తప్ప ఎన్నిసార్లు సర్ ప్రక్రియ చేపట్టినా నకిలీ ఓట్లు తొలగింపు అసాధ్యమే. ఇకపోతే ఇల్లుమారిన లేదా, చనిపోయిన వారి ఓట్లను ఎలా తొలగిస్తారన్నది కూడా ప్రశ్నే. ఇదిలావుంటే అన్ని రాజకీయ పార్టీలు సమావేశాలు పెట్టి తమ కార్యకర్తలను అప్రమత్తం చేస్తున్నాయి. ఓట్లు తొలగిపోకుండా చూడాలని జాగ్రత్తలు చెబుతున్నాయి. అందుకు బూత్‌లెవల్లో శిక్షణ కూడా ఇచ్చారు. ఓ వైపు ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే సమావేశాలు



కొనసాగుతున్నాయి. దీనిని బట్టి రాజకీయ పార్టీల్లో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. నకిలీ ఓట్లను తొలగించే విధానాన్ని కేంద్ర ఎన్నికల సంఘం సర్ ద్వారా గత కొన్నేళ్లుగా సంస్కరిస్తోంది. ఇది కొత్తగా బిజెపి ఏలుబడిలో తీసుకువచ్చిందేమీ కాదు. గతంలో యూపిఎ హయాంలోనూ సర్ ప్రక్రియ సాగింది. అయితే అప్పట్లో తూతమంత్రంగా సాగడంతో ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. 'సర్' పక్రియ చట్టబద్ధమేనని, కానీ వాటి కోసం అవలంబించే పద్ధతుల్లో మార్పులు తెచ్చుకోవాలని ఈ దేశ అత్యున్నత న్యాయస్థానం అన్ని రాజకీయ పార్టీలకు, కేంద్ర ఎన్నికల సంఘానికి హితవు చెప్పింది. ఓటు హక్కు ఒకటే యువత భవిష్యత్‌ను నిర్మించుకునేందుకు ఉన్న ఏకైక ఆయుధమని నమ్ముతుంటాం. ఓటు ఉంటేనే నేతలు ఉంటారు. అధికారం ఉంటుంది. అందుకే ఓట్ల కోసం అభ్యర్థులు, పార్టీలు డబ్బులు విరజిమ్మడం ద్వారా అధికార పీఠం దక్కించుకునేందుకు నానా గడ్డీ కరుస్తుంటారు. ఇప్పుడు సర్ ప్రక్రియ ద్వారా తమవారి ఓట్లు పోకుండా జాగ్రత్త పడడం ఇందులో భాగమే.ప్రజాస్వామ్యంలో ధనస్వామ్యం చొరబడిన తరవాత ప్రజాస్వామ్యం ఇప్పుడు వికటిస్తున్నది. ఈ పరిస్థితుల్లో 'ఓటు' దుర్వినియోగం అవుతోంది. డబ్బులు పెట్టి ఓట్లు కొనసడం అలవాటు చేసుకున్నారు. దొంగ ఓట్లతో జాతర నడిపిస్తున్నారు. స్థానికంగా లేని వారికి ఓటు హక్కు కల్పించడం, ఆ ఓటును ఎవరో వేసేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో సర్' పేరుతో అసలుసిసలు ఓటర్లను జాబితాలోంచి తీసేస్తున్నారన్న ఆరోపణల మధ్య రాజకీయ పార్టీలు ఓట్లను దక్కించుకునేందుకు జాగ్రత్త పడుతున్నాయి. బీహార్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, తదితర రాష్ట్రాలకు సర్ ప్రక్రియ పూర్తయిన తరవాతనే ఎన్నికలు జరిగాయి. కొన్ని చోట్ల ప్రభుత్వాలు మారడంతో ఓట్లను తొలగిస్తున్నారన్న ప్రచారం చేపట్టారు. ఇంత ప్రక్షాళన జరిగినా కొన్ని చోట్ల అక్రమంగా తమ ఓట్లు తొలగించారన్న ఆవేదనలు వినిపిస్తూనే ఉన్నాయి. సాధారణ పౌరులెవరికీ 'సర్' పట్ల ఎలాంటి అసంతృప్తి లేదు. ఈ పక్రియలో ఓటు హక్కు కోల్పోయామని ఆందోళన చెందిన ఓటర్లు కూడా ఇప్పుడు ఒక్కక్కరూ ఆందోళన చెందుతున్నారు. ఏ వ్యవస్థలో అయినా లోపభూయిష్టమైన విధానాలకు చెక్ పెట్టాల్సిందే. ఓటు ఉన్నవారు నిర్భయమంగా ఉండాల్సిందే. ఎలాంటి ఆందోళనలు అవసరం లేదు.

ఎన్నికల సంఘం కూడా అలాంటి వారిని ఎక్కడా తప్పు పట్టడం లేదు. జాబితాలో తొలగించడం లేదు. అవగాహన లేనివారు మాత్రమే ఆందోళనతో అయోమయంలో పడిపోతున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితా ఎంతో విశ్వసనీయత కలిగి ఉండటం అవసరం. రెండు ఓట్లు, ఇక్కడ లేని వారి ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు తొలగించేందుకు ఇసికి రాజకీయ పార్టీలు సహకరిస్తే సమస్య సులువుగా పరిష్కారం అవుతుంది. కానీ రాజకీయా పార్టీలు అలా చేయడం లేదు. రాజకీయ పార్టీల చర్యలు ఓటర్లలోనూ గందరగోళంలఅఓ పడేసేలా ఉంటోంది. ఓట్లు పోతాయంటూ చేస్తున్న హెచ్చరికలు భయాందోళనకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారు తమ ఓటు ఎక్కడ పోతుందో అన్న ఆందోళన చెందుతున్నారు. శాశ్వతంగా ఒకే ప్రాంతంలో నివసించే వారిఓట్ల జోలికి ఇసి వెళ్లడం లేదు. కొన్ని చోట్ల తాము వెళ్లినప్పుడు ఓటర్లు అక్కడ లేకపోవడం, తగిన కారణాలు చూపక పోవడంతో తొలగించడం జరుగుతోంది. ఇంటింటికీ వెళ్లి ధృవీకరణద్వారా జాబితాను జల్లెడ పడుతున్నారు. ఒకటి కన్నాఎక్కువ ప్రాంతాల్లో పేర్లు నమోదై, వారు మరో చోట నివసిస్తుంటే వారి ఓటు హక్కు ఆ ప్రాంతానికే మార్చుకోవాలి. ఎక్కడ శాశ్వత నివాసం ఉంటుందో అక్కడే ఓటును పొందాలి. అంతేగానీ పలుచోట్ల ఓటును కలిగి ఉండడం కూడా నేరం. ఇలాంటి విషయాలను రాజకీయా పార్టీలు ప్రచారం చేయడం లేదు. రాజకీయ ఎత్తుగడ కోసం ఓట్లు తొలగిస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నాయి. 'సర్' పూర్తిగా చట్టబద్దమైన పారదర్శక పక్రియ అనడంలో సందేహమే లేదు. కేంద్ర ఎన్నికల సంఘం తరచు సమీక్షలు చేయడం ద్వారా ఓటర్ల గుర్తింపునకు వెసులు బాటుగా అవగాహన కల్పించడం, వారి ఓటుకు చోటు లభించేటట్లు చేయడం అత్యంతావశ్యకం. అవగాహనలోపం వల్ల అర్హులైన ఓటర్లు కూడా తమ 'ఓటుహక్కును దక్కించుకోవడం కోసం అజాగ్రత్తగా ఉండరాదు. రాజకీయ పార్టీలు గ్రామాల వారీగా జాబితాలు ముందుర వేసుకుంటే ఎవరు స్థానికులో ఎవరు కాదో తెలుస్తుంది. ఎవరు ఓటరో కాదో తెలుస్తుంది. చనిపోయిన వారు ఎవరో కూడా వారికి తెలుసు. ఇలాంటి విషయాల్లో ఆయా పార్టీలు నేరుగా ఎన్నికల సంఘానికి సహకరించి, అనర్హత కలిగిన ఓట్లను తొలగించాలి. అప్పుడే ఓటరు సమగ్ర జాబితా రూపొందగలదు.

# మన్యంవీరుడు అల్లూరికి ఘన నివాళి

**ఎక్స్ వేదికగా నివాళి అర్పించిన బాబు, లోకేశ్ -అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి అనిత నివాళి**

**అమరావతి,జూలై 4 రిపబ్లిక్ న్యూస్.**
స్వాతంత్య్ర సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ నివాళులర్పించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. అల్లూరి త్యాగం, ధైర్యం, దేశభక్తి భారత జాతికి చిరస్మరణీయమని ముఖ్యమంత్రి కొనియాడారు. మన్యం వీరుడి పోరాట పటిమ, విప్లవ కార్యాచరణ అనితర సాధ్యమని మంత్రి లోకేశ్ అన్నారు. 'స్వాతంత్య్ర సమర చరిత్రలో అజరామరమైన అధ్యాయంగా నిలిచారు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం బ్రిటిష్ పాలనకు ఎదురొడ్డి అపూర్వ సాహసాన్ని ప్రదర్శించిన మహనీయుడు. ఆయన త్యాగం, ధైర్యం, దేశభక్తి యావత్ భారత జాతికి చిరస్మరణీయం. అల్లూరి సీతారామరాజు 129వ జయంతి సందర్భంగా ఆ మహావీరుడికి ఘన నివాళులు అర్పిస్తున్నాను' అని చంద్రబాబు పోస్ట్ చేశారు. 'మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆ



మహనీయుని స్మృతికి ఘన నివాళులు అర్పిస్తున్నాను. భారత స్వాతంత్య్ర ఉద్యమాన్ని విప్లవపథం వైపు నడిపిన పోరాటయోధుడు అల్లూరి సీతారామరాజు. దేశభక్తికి, త్యాగనిరతికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. ఆయన పోరాట పటిమ, విప్లవ కార్యాచరణ అనితర సాధ్యం. తెలుగుజాతికి, దేశానికి స్ఫూర్తిప్రదాతగా నిలిచిన అల్లూరి సీతారామరాజు సేవలను ఈ సందర్భంగా
స్మరించుకుందాం' అని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. స్వాతంత్య్ర సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయం వద్ద అల్లూరి విగ్రహానికి హోంమంత్రి అనిత పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. దేశ స్వాతంత్యం÷-ర కోసం పోరాడిన యోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని అన్నారు. ప్రజల హక్కుల కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన విప్లవ జ్యోతి మన్యం వీరుడు అని కొనియాడారు. అల్లూరి దేశభక్తి, ధైర్యం యువతరానికి ఆదర్శమని హోంమంత్రి అన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో అల్లూరి జయంత్యుత్సవాలను రాష్ట్ర పండుగగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. తెలుగు జాతి ఉన్నంతవరకూ ఆయన త్యాగం ప్రజల గుండెల్లో ఉంటుందన్నారు. అల్లూరి సీతారామరాజు ధైర్య సాహసాలకు ప్రతీక అని హోంమంత్రి అనిత కొనియాడారు.

-----------

# పాపికొండల యాత్ర మళ్లీ ప్రారంభం

**రాజమండ్రి, భద్రాచలం నుంచి యధావిధిగా యాత్ర**



**రాజమండ్రి,జూలై 4 రిపబ్లిక్ న్యూస్.** భద్రతా కారణాల దృష్ట్యా గత జూన్ చివరి వారంలో తాత్కాలికంగా నిలిచిపోయిన ప్రపంచ ప్రసిద్ధ పాపికొండలు బోటింగ్ విహారయాత్రకు ఎట్టకేలకు అధికారులు మళ్లీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గోదావరి నది ఉధృతి తగ్గుముఖం పట్టడం, పర్యాటక బోట్ల ఫిట్‌నెస్ మరియు భద్రతా ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ యాత్రను అటు రాజమండ్రి పుష్కర ఘాట్ నుండి, ఇటు భద్రాచలం నుండి పర్యాటకుల సౌకర్యార్థం అందుబాటులోకి తెచ్చారు. ప్రకృతి ప్రేమికులకు, కుటుంబ సమేతంగా ఆహ్లాదకరమైన సమయాన్ని గడపాలనుకునే వారికి ఇది ఒక గొప్ప అవకాశం. గోదావరి జలవిహారంలో పర్యాటకులకు ఆధ్యాత్మికతతో పాటు ప్రకృతి అందాలను వీక్షించే అద్భుతమైన అవకాశం లభిస్తుంది. ఈ టూర్ ప్యాకేజీలో భాగంగా గండిపోచమ్మ ఆలయం, సుందరమైన పాపికొండలు, మరియు ప్రశాంతమైన పేరంటాలపల్లి ఆశ్రమం వరకు బోటింగ్ ప్రయాణం సాగుతుంది. ప్రయాణీకుల భద్రతకు పెద్దపీట వేస్తూ లైఫ్ జాకెట్లు మరియు అనుభవజ్ఞులైన సిబ్బందిని బోట్లలో అందుబాటులో ఉంచారు. ఇక టికెట్ ధరల విషయానికి వస్తే? పెద్దలకు రూ. 1250, మరియు 5 నుండి 10 సంవత్సరాల లోపు పిల్లలకు రూ. 1050 గా నిర్ణయించారు. చాలా కాలం తర్వాత బోటింగ్ పునఃప్రారంభం కావడంతో పర్యాటక రంగం మళ్లీ కళకళలాడనుంది.

# సీజనల్ వ్యాధులపై యుద్ధానికి 108 సర్వ సన్నద్ధం

**వేగవంతమైన వైద్యసేవలతో ప్రజారోగ్యానికి అండగా 108 -ప్రతి అంబులెన్స్‌లో అత్యవసర మందులు, వైద్య పరికరాలు సిద్ధం**

**అమరావతి,జూలై 4 రిపబ్లిక్ న్యూస్.** వర్షాకాలం సీజనల్ వ్యాధులు పెరిగే అవకాశాల నేపథ్యంలో ప్రజలకు సకాలంలో అత్యవసర వైద్యసేవలు అందించేందుకు 108 అంబులెన్స్ సేవలు పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా కాలానుగుణ వ్యాధులతో పాటు పాములు, తేళ్లు, ఇతర విష కీటకాల కాట్లు, విద్యుత్ ప్రమాదాలు, నీటిలో మునిగే ఘటనలు పెరిగే అవకాశం అవకాశం ఉంది. ఈ క్రమంలో గ్రామీణ ప్రాంతాలు, వ్యవసాయ పొలాలు, ఏజెన్సీ ప్రాంతాలు, అడవులకు సమీప ప్రాంతాల్లో నివసించే ప్రజలకు అత్యవసర వైద్య సేవలు వేగంగా అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. వర్షాల కారణంగా రహదారులు దెబ్బతినడం, నీటిమునక ప్రాంతాలు ఏర్పడటం వంటి పరిస్థితుల్లోనూ బాధితులకు వీలైనంత త్వరగా వైద్య సహాయం అందించేందుకు 108 బృందాలు నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తున్నాయి.గోల్డెన్ అవర్ లో స్పందనవర్షాకాల అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని 108 అంబులెన్స్‌లలో అవసరమైన అత్యవసర మందులు, ఆక్సిజన్, ప్రాథమిక ప్రాణరక్షక పరికరాలు, ఇతర వైద్య సామగ్రిని అందుబాటులో ఉంచారు. అత్యవసర పరిస్థితుల్లో సమయానికి స్పందించేలా ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు (ఇఓబఐ), పైలట్లకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశారు. గోల్డెన్ అవర్‌లో బాధితులకు ప్రాథమిక చికిత్స అందించి సమీప ఆసుపత్రికి సురక్షితంగా తరలించేందుకు అన్ని విధాలా సన్నద్ధంగా ఉన్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చోట అదనపు సమన్వయంతో సేవలు అందిస్తున్నారు.ప్రాణాధారంగా 108గత ఏడాది (జూలై



2025?జూన్ 2026) కాలంలో 108 సేవలు వర్షాకాలంలో ఎక్కువగా కనిపించే అత్యవసర పరిస్థితుల్లో వేలాది మందికి ప్రాణాధారంగా నిలిచాయి. ఈ కాలంలో జ్వరానికి సంబంధించిన 28,933 అత్యవసర కేసులు, జంతువులు/విష కీటకాల కాట్లకు సంబంధించిన 14,353 కేసులు, విద్యుత్ షాక్‌కు సంబంధించిన 2,194 కేసులు, నీటిలో మునిగిన 718 కేసులు, పిడుగుపాటుకు సంబంధించిన 96 కేసులకు సకాలంలో స్పందించి అత్యవసర వైద్య సేవలు అందించాయి. ఈ గణాంకాలు వర్షాకాలంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో సమయానికి అందే వైద్య సహాయమే ప్రాణాలను కాపాడగలదని ఈ ఘటనలు మరోసారి నిరూపించాయి.వర్షాకాలంలో ముఖ్యంగా పాములు, తేళు ,, ఇతర విష కీటకాలు నివాస ప్రాంతాల్లోకి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. స్థానిక చికిత్సలపై ఆధారపడకుండా వైద్య నిపుణుల సహాయం పొందడం వల్ల ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశాలు మెరుగవుతాయి.( పజారోగ్యమే లక్ష్యంఈ సందర్భంగా భవ్య హెల్త్ కేర్ మీడియా కోఆర్డినేటర్ మాట్లాడుతూ... ప్రజల ప్రాణాలను కాపాడడమే 108 సేవల ప్రధాన లక్ష్యమని తెలిపారు. వర్షాకాలంలో ఎదురయ్యే ప్రతి అత్యవసర పరిస్థితికి సిద్ధంగా ఉండేలా అంబులెన్స్‌లు, సిబ్బంది, వైద్య పరికరాలను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచామని చెప్పారు. పాము లేదా విష కీటకం కాటు, విద్యుత్ షాక్, నీటిలో మునిగే ప్రమాదం, తీవ్ర జ్వరం లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా వెంటనే 108కు కాల్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల అప్రమత్తతతో పాటు సమయానికి అందే అత్యవసర వైద్య సేవలే అనేక ప్రాణాలను కాపాడగలవని పేర్కొన్నారు.
వర్షాకాలంలో ప్రజలకు 108 సూచనలువానాకాలంలో ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, నిల్వ నీరు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలిదోమల నివారణ చర్యలు చేపట్టాలని, శుద్ధి చేసిన తాగునీరు మాత్రమే వినియోగించాలిఅనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని లేదా వైద్యులను సంప్రదించాలిపాము లేదా విష కీటకం కాటు పడితే స్థానిక చికిత్సలకు వెళ్లకుండా వెంటనే 108కు కాల్ చేయాలినీటిలో మునిగిన వ్యక్తికి వీలైనంత త్వరగా అత్యవసర వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలితెగిపడిన విద్యుత్ తీగలు లేదా నీటిలో ఉన్న విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండాలిఅధిక జ్వరం, స్పృహ కోల్పోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వైద్య సహాయం పొందాలిభారీ వర్షాలు, వరదల సమయంలో అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలి.

# నగర హోటళ్లలో నాణ్యత డొల్ల

**అపరిశుభ్ర వాతావరణం..కల్తీ పదార్థాలు**

**దాడులు చేస్తున్నా పట్టించుకోకుండా అమ్మకాలు**

**వందరోజుల్లో 185 కేసులు నమోదు**

**హైదరాబాద్,జూలై 4 రిపబ్లిక్ న్యూస్.**
ఆహార కల్తీపై హెచ్-ఫాస్ట్ ఉక్కుపాదం మోపింది. నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లలో దాడులు చేసిన హెచ్-ఫాస్ట్ అధికారులు భారీగా కేసులు నమోదు చేశారు. 100 రోజుల్లో దాదాపు 185 కేసులను నమోదు చేశారు. దాడుల్లో 121.87 టన్నుల కల్తీ, నాణ్యతలేని ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. మార్చి 19న ప్రారంభమైన హెచ్-ఫాస్ట్ దాడులకు 100 రోజులు పూర్తి అయ్యింది. ఈ వంద రోజుల్లో రాజేంద్రనగర్ జోన్‌లో అత్యధికంగా 55 కేసులు, గోల్కొండలో 44 కేసులు నమోదు అయ్యాయి. దాదాపు 27 టన్నులకు పైగా నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు.రసాయనాలతో మగ్గబెట్టిన 25.8 టన్నుల పండ్లను అధికారులు సీజ్ చేశారు. 60 టన్నులకు పైగా చికెన్ వ్యర్థాలు, 15 టన్నుల నాణ్యతలేని చికెన్, మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. హెచ్-ఫాస్ట్ అధికారుల దాడుల్లో కల్తీ కోవా, పనీర్, పెరుగు, నెయ్యి, క్రీమ్, టీ పొడి భారీగా పట్టుబడింది. ఆరోగ్యానికి హానికరమైన 247 కేసులను జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగానికి బదిలీ చేశారు. ప్రజల ఫిర్యాదుల ఆధారంగా 90 కేసులు నమోదవగా... పనీర్ అవుట్‌లెట్లపై 70 కేసులు నమోదు అయ్యాయి. నాణ్యమైన ఆహారం విషయంలో హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలకు హెచ్-ఫాస్ట్ అధికారులు కఠిన మార్గదర్శకాలు జారీ చేశారు. ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ లైసెన్స్, ఈఎఈక్ష విధానం, వాడిన నూనె పునర్వినియోగంపై ఆంక్షలు విధించారు. కల్తీ మాఫియాపై అవసరమైతే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని సీపీ వీసీ సజ్జనర్ హెచ్చరిక జారీ చేశారు. ప్రతి రోజు సగటున 15 కల్తీ ఆహార ఫిర్యాదులు అందుతున్నట్లు వెల్లడించారు. కల్తీ సమాచారం ఉంటే డయల్ 100, ఊ-ఈం÷ వాట్సాప్, ఫోన్ నంబర్ 8712661212కు సమాచారం ఇవ్వాలని సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.

--------

# ఆదివాసీల సమస్యలు పరిష్కరించడం లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

## బీఎస్పీ ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం



**కరీంనగర్ ప్రతినిధి జులై 4 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
కుమురం భీమ్ అసిఫాబాద్ :- ఆదివాసీల సమస్యలు పరిష్కరించడం లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిందని బహుజన్ సమాజ్ పార్టీ ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం అన్నారు. ఈ రోజు జిల్లా కేంద్రంలో బీఎస్పీ పార్టీ కార్యాలయాన్ని ప్రారంబించారు అనంతరం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మహానీయుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతకరం హాజరైన కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ ఆదివాసీల భూ హక్కులు చాలామంది గోండు, కొలాం, నాయక్‌పోడ్, ప్రధాన్ వంటి ఆదివాసీ కుటుంబాలకు సాగు చేస్తున్న భూములపై పూర్తి హక్కులు లేవు. ఫారెస్ట్ రైట్స్ ఆక్ట్ కింద ఆదివాసీలు హక్కుల కోసం దరఖాస్తులు పెట్టుకుంటే స్థానిక ఎమ్మెల్యే కనీసం ఆదివాసీల పట్ల చిత్తశుద్ధితో లేకుండా ఆదివాసీలను నిర్లక్ష్యం చేస్తున్నారు అని మండిపడ్డారు. ఆదివాసీ ప్రజలకు విద్య అందించే విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు మారుమూల తండాలు, గూడేలలో పాఠశాలలు ఉన్నా ఉపాధ్యాయుల కొరత, రవాణా సమస్యలు, మధ్యలో చదువు మానివేయడం వంటి సమస్యలు ఉన్నాయి అని రామచంద్రం అన్నారు. ముఖ్యంగా ఉన్నత విద్యకు విద్యార్థులను ప్రోత్సహించే బాధ్యత నుండి స్థానిక ఎమ్మెల్యే , కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యాయని అన్నారు.
ఆదివాసీల ఆరోగ్యం విషయం లో కూడ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు. గర్భిణీ స్త్రీలు, చిన్న పిల్లలకు వైద్య సేవలు సమయానికి అందకపోవడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు దూరంగా ఉండటం, అంబులెన్స్ సౌకర్యం ఆలస్యం కావడం వంటి సమస్యలు ఉన్నాయి అని అన్నారు. ఎన్నికల సమయంలో ఆదివాసీల కోసం అనేక వాగ్దానాలు చేశారని అవి నేడు అమలు కావడం లేదన్నారు. అందుకే ఆదివాసీలు బహుజన ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వారితో పాటు ఎస్సీలు ముస్లిం లు బహుజన రాజ్యాధికారం కోసం బెహన్ జీ మాయావతి గారి నాయకత్వంలో పని చేయాలని కోరారు. కేంద్రం లో అధికారంలో ఉన్న బిజెపి మతం పేరు మీద ప్రజలను విడదీసి నీచ రాజకీయాలకు పాల్పడుతుందన్నారు. మనం అందరం ఐక్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జోన్ ఇంచార్జ్ కల్లెపెల్లి రాజేందర్ పార్లమెంట్ ఇంచార్జ్ సాలం బిన్ హసన్ జిల్లా అధ్యక్షుడు దుర్గం తుకరాం, జిల్లా ఉపాధ్యక్షుడు ముదస్సీర్ హుస్సేన్ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహ్మద్ సిరాజుద్దీన్ , ఆసిఫాబాద్ అసెంబ్లీ ఇన్చార్జి కనక ప్రభాకర్, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి చునార్ కర్ చరణ్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లాలోనే సంచలన రికార్డ్ సృష్టించిన అభిజ్ఞ హై స్కూల్

## చెట్లు నాటే కార్యక్రమాన్ని మొదలుపెట్టిన అభిజ్ఞ హై స్కూల్



**హత్నూర:04 జూలై (రిపబ్లిక్ న్యూస్)**
ఈరోజు జరిగిన చెట్ల నాటు కార్యక్రమంలో అభిజ్ఞ హై స్కూల్ స్టూడెంట్స్ దౌల్తాబాద్ పట్టణంలో వివిధ రకాల మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మేడం మాట్లాడుతూ చెట్లు ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన వరం. భూమిపై చెట్ల వలన పచ్చని వాతావరణం నెలకొంటుంది, చెట్లు మానవులకు అనేక రకాలుగా ఉపయోగపడతాయి. చెట్ల వలన గాలి నీరు ఆహారం మరెన్నో లభిస్తాయి. చెట్ల నుండి పండ్లు కూరగాయలు కూడా లభిస్తాయి. చెట్లు కాలుష్యాన్ని తగ్గించి, పర్యావరణాన్ని రక్షిస్తాయి. చెట్ల వలన వర్షాలు పడి పంటలు పండుతాయి. చెట్లు కార్బన్ డయాక్సైడ్ ను తీసుకొని ప్రాణులకు ఆక్సిజన్ అందజేస్తాయి. చెట్లు చాలా రకాలు, మామిడి చెట్టు కొబ్బరి చెట్టు వేప చెట్టు ఇలా ఎన్నో రకాలు ఉన్నాయి. చెట్ల వలన పుష్పాలు కూడా లభిస్తాయి. చెట్లు లేకపోతే ఈ భూమి మీద ఏ ప్రాణులు నివసించలేవు. ఎలాంటి ఆహారం లభించదు. కావున మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుదాం. అని విద్యార్థులకు బోధించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది కూడా పాల్గొన్నారు.







# సర్ కార్యక్రమంపై ఓటర్లకు అవగాహన సదస్సు.





**రైల్వే కోడూరు జూలై 4 రిపబ్లిక్ న్యూస్.**
సర్ కార్యక్రమం దగ్గర పడుతున్న కొద్దీ నాయకులు బిఎల్ఏలు బిఎల్వోలు ఈ కార్యక్రమాన్ని తొందరగా సకాలంలో పూర్తి చేయడానికి రైల్వేకోడూరు మండలం వెంకటరెడ్డి పల్లి గ్రామంలో ఓటర్లకు సర్ కార్యక్రమంపై అవగాహన కల్పించడం జరిగినది ఈ అవగాహన సదస్సులో రాయలసీమ జోనల్ వైఎస్ఆర్సిపి కన్వీనర్ గుంతకల్లు డిఆర్ యు సి సి సభ్యుడు తెల్లెం భరత్ కుమార్ రెడ్డి శనివారం ఈ సదస్సులో పాల్గొని సర్ కార్యక్రమం పై ఓటర్లకు అవగాహన కల్పించారు
ఆయన చురుగ్గా నియోజకవర్గంలో సర్ కార్యక్రమంలో పాల్గొంటూ ఓటర్లను కార్యక్రమంపై మేలుకొలుపుతూ సకాలంలో తొందరగా ఎన్యూమరేషన్ పత్రాలు పూర్తిచేసి సంబంధిత అధికారులకు ఇవ్వాల్సిందిగా ఆయన ఓటర్లను కోరారు
రైల్వే కోడూరు మండల పరిధిలోని వెంకట్ రెడ్డి పల్లి పంచాయతీలో శనివారం సర్ కార్యక్రమం నిర్వహణలో భాగంగా బిఎల్ఎ బిఎల్ఓ లతో కలిసి పర్యటించి ఆ పంచాయతీలోని ఓటర్లకు సర్ కార్యక్రమం గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ( సర్ ) కార్యక్రమం అనేది మరణించిన వారి పేర్లు, ఒకే వ్యక్తికి రెండు లేదా అంతకంటే ఎక్కువ చోట్ల ఉన్న డూప్లికేట్ ఓట్లు, శాశ్వతంగా వేరే ప్రాంతానికి వలస వెళ్లిన వారి వివరాలను ఓటర్ లిస్ట్ నుండి తొలగిస్తారు. అంతేకాకుండా కొత్తగా ఓటు హక్కు పొందేందుకు అర్హులైన యువతీ యువకులను జాబితాలో చేర్చుతారు. ప్రోజెనీ మ్యాపింగ్ ప్రస్తుతం ఉన్న ఓటర్ల వివరాలను వారి తల్లిదండ్రులు లేదా కుటుంబ సభ్యుల పాత రికార్డులతో సరిపోల్చడం ద్వారా ఓటరు సమాచారాన్ని ధృవీకరిస్తారు. కావున మన పంచాయతీలలో ఉన్న ఓటర్లు ఎన్యుమరేషన్ పత్రాలను బిఎల్ఓ ద్వారా తీసుకున్న వారు సరైన సమాచారం అందించి తమ ఓట్లను పోకుండా కాపాడుకోవాలని అంతేకాకుండా తద్వారా మన ఓటు హక్కును 20 సంవత్సరాల తర్వాత ప్రస్తుతం జరుగుతున్న ఈ సర్ కార్యక్రమం ద్వారా కాపాడుకునే దానికి ఒక అవకాశం కాబట్టి ప్రతి ఒక్కరు ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటే మన ఆయుధం అనే దిశగా ముందుకు కొనసాగాలని వెంకటరెడ్డి పంచాయతీలోని ప్రజలకు ఆయన దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాయని హరికృష్ణ రెడ్డి,మాదినేని వెంకటరెడ్డి మరియు బిఎల్ఎ యానాది రెడ్డి, గునిశెట్టి రమేష్,రమణ, వెంకటేష్,శ్రీను, వెంకట సుబ్బయ్య మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పీడీఎస్ బియ్యాన్ని అక్రమ మార్గంలో తరలించడం, మళ్లించడం ఆవక తవకలకు పాల్పడితే కఠిన చర్యలు

## జిల్లా పౌరసరఫలాధికారి నిత్యానంద్



**మెదక్ జిల్లా ప్రతినిధి జులై 4(ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
అసిస్టెంట్ సివిల్ సప్లై ఆఫీసర్, వారి సిబ్బంది మరియు స్టేట్ టాస్క్ ఫోర్స్ టీమ్-2, హైదరాబాద్ అధికారులతో కలిసి మెదక్ పట్టణంలోని ఎన్. నర్సమ్మ నిర్వహిస్తున్న ఫెయిర్ ప్రైస్ షాప్ నెం. 1784018 లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారని విద్యానంద్ తెలిపారుతనిఖీలలో షాపులో 12.42 క్వింటాళ్ల సన్న బియ్యం మరియు 61.28 క్వింటాళ్ల దొడ్డు బియ్యం నిల్వలు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో సంబంధిత డీలర్‌పై అత్యావశ్యక వస్తువుల చట్టం, 1955 ప్రకారం సెక్షన్ 6-ఊ కింద కేసు నమోదు చేయడం జరిగింది.రేషన్ కార్డు లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు, తదుపరి జిల్లా కలెక్టర్ (సివిల్ సప్లైస్) వారి ఆదేశాలు వెలువడే వరకు దుర్గాప్రసాద్ నిర్వహిస్తున్న ఫెయిర్ ప్రైస్ షాప్ నెం. 1784002 కు సదరు షాపు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా పౌర సరఫరా అధికారి మాట్లాడుతూ, మెదక్ జిల్లాలోని ఏ ఫెయిర్ ప్రైస్ షాప్ డీలర్ అయినా పీడీఎస్ బియ్యాన్ని అక్రమ మార్గంలో తరలించడం, మళ్లించడం లేదా దుర్వినియోగం చేసినట్లు గుర్తిస్తే, వారిపై కూడా సెక్షన్ 6-ఊ కింద కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయబడతాయని హెచ్చరించారు.

# దొడ్డి కొమరయ్యకు ఘన నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్








**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై (ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య వర్ధంతిని పురస్కరించుకొని శనివారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో ఉన్న దొడ్డి కొమరయ్య విగ్రహానికి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, దొడ్డి కొమరయ్య తెలంగాణ రైతాంగ ఉద్యమ చరిత్రలో చెరగని ముద్ర వేసిన మహనీయుడని, ఆయన త్యాగం, ధైర్యసాహసాలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, వివిధ కుల సంఘాల నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొని దొడ్డి కొమరయ్యకు ఘనంగా నివాళులర్పించారు.

# బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ





**మల్లాపూర్ జులై 4 (రిపబ్లిక్ న్యూస్)**మల్లాపూర్ మండలంలోని రేగుంట గ్రామంలో ఇటీవల మరణించిన లింగాల సుమ మరియు మేల్ల రాజ్ కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చిన కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కుమార్. ఆయన వెంట రేగుంట గ్రామ బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

# నర్సాపూర్ నియోజకవర్గంలో బీఎస్పీ నాయకుడు శాంతన్న మరణం పార్టీకి తీరని లోటుగా కొనియాడారు



**నర్సాపూర్ జులై 4 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం లో బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు బెహన్జి కుమారి మాయావతి గారి ఆదేశాల మేరకు మరియు సెంట్రల్ మరియు సెక్టర్ చీఫ్ కోఆర్డినేటర్ అత్తర్ సింగ్ సార్ గారి సూచనల మేరకు రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రహీం శేఖర్ అన్న గారి ఆదేశాలు మేరకు మరియు జోన్ 3 చీఫ్ ఇంచార్జ్ బోడపట్ల ఈశ్వర్ అన్నసూచనల మేరకు జిల్లా అధ్యక్షుల ఆధ్వర్యంలో నాగులాపల్లి గ్రామానికి వెళ్లడం జరిగింది అక్కడ మన దీర్గా సీనియర్ నాయకులు... కీర్తిశేషులు సాతెల్లి శాంతన్న గారిని గుర్తుచేస్తూ పార్టీ కోసం శాంతన్న గారి త్యాగాన్ని మరువలేమని వారిని స్ఫూర్తిగా తీసుకొని మరి ఎందరు నాయకులు ముందుకు నడవాలని కోరుతూ వారి గ్రామంలో కుటుంబాన్ని కలవడం జరిగింది. అందులో భాగంగా వివిధ గ్రామాలకు వెళ్లడం జరిగింది నర్సాపూర్ నియోజకవర్గ బిఎస్పి నాయకుల తో రాబోయే రోజుల్లో పార్టీని బలోపేతం చేసే దిశగా కలవడం జరిగింది. మెదక్ పార్లమెంట్ ఇంచార్జి పీపడ్ పల్లి మోహన్ గారు మెదక్ జిల్లా అధ్యక్షులు ఎర్ర శంకర్ గారు డిస్ట్రిక్ ట్రెజరర్ ఆనంద్ గారు నర్సాపూర్ నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు త్వరలోనే నర్సాపూర్ అసెంబ్లీ కుడా కమిటీ పూర్తి వేయడం జరుగుతుంది తెలియజేశారు.

# తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య అని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు





**మెదక్ జిల్లా ప్రతినిధి**
**జులై 4 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
తొలి సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య 81వ వర్ధంతి సందర్భంగా శనివారం మెదక్ సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన లి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్ దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు సమర్పించి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూయువత దొడ్డి కొమురయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని సమాజాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వం నుంచి బడుగు బలహీన వర్గాలకు అన్ని విధాలా సహాయసహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, డిపిఓ యాదయ్య,గిరిజన సంక్షేమ అధికారి నీలిమ డీఈఓ రాజు బీసీ సంక్షేమ అధికారులు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు

# ఆర్టీసీ బస్టాండ్ కు చక్రాల కుర్చీ అందజేసిన నంద్యాల లయన్స్ క్లబ్

. వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం చక్రాల కుర్చీ అందించాం: లయన్స్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ.

. లయన్స్ క్లబ్ కు ధన్యవాదాలు తెలిపిన ఆర్టీసీ డీఎం మాధవి లత



**నంద్యాల జులై 4( రిపబ్లిక్ న్యూస్) :** నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నంద్యాల ఆర్ టి సి బస్టాండ్ లో దివ్యాంగులు, వృద్ధుల సౌకర్యార్థం చక్రాల కుర్చీ అందజేశారు.నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేశుల నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని నంద్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ మాధవి లతకు వీల్ చైర్ ను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా ఆర్టీసీ బస్టాండ్ లో ప్రయాణికుల సౌకర్యార్థం సహకారం అందిస్తామని అన్నారు. గత వారం రైల్వే స్టేషన్ కు రెండు చక్రాల కుర్చీలు అందజేశామని గుర్తు చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేశుల నాగరాజు మాట్లాడుతూ 2025- 26 సంవత్సరంలో దాదాపు 200 సేవా కార్యక్రమాలు నిర్వహించామని చివరి కార్యక్రమం గా దివ్యాంగులకు, వృద్ధులకు ఉపయోగపడే సేవా కార్యక్రమం చేయడం సంతోషాన్ని కలిగించింది అన్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్ మాధవి లత మాట్లాడుతూ లయన్స్ క్లబ్ వీల్ చైర్ అందజేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. లయన్స్ క్లబ్ సేవా దృక్పథాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ కిషోర్, అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ ఉదయ భాస్కర్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డీ.కే. మూర్తి, నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు సుబ్బరాజు, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సోమేశుల నాగరాజు, తాతి రెడ్డి భాస్కర్ రెడ్డి, కోశాధికారి అమిదేల జనార్ధన్, జోనల్ చైర్మన్ నిజాముద్దీన్, నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు ఎం.పీ.వి.రమణయ్య, నూతన అధ్యక్షులు గా ప్రమాణ స్వీకారం చేయనున్న సందీప్, సీనియర్ సభ్యులు యూసఫ్ పాల్గొన్నారు.

# అరుదైన ఏనెగటివ్ రక్తాన్ని ఏడోసారి దానం చేసి ప్రాణాన్ని కాపాడిన వికలాంగుడు గుర్రం శ్యామ్‌కుమార్‌కు ప్రశంసలు

భారత్ వికాస్ పరిషత్ & ఆయుష్ యోగా సేవా సమితి అధ్యక్షులు కండే ఆనంద్ గురూజీ



**నంద్యాల ఎ**

విజయా బ్లడ్ బ్యాంక్‌లో రక్తహీనతతో బాధపడుతున్న ఒక మహిళకు అత్యవసరంగా అవసరమైన అత్యంత అరుదైన ఏనెగటివ్ రక్తాన్ని వికలాంగుడైన గుర్రం శ్యామ్‌కుమార్ స్వచ్ఛందంగా దానం చేసి మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఇప్పటివరకు ఆయన ఏడు సార్లు రక్తదానం చేసి పలువురి ప్రాణాలను కాపాడడంలో భాగస్వామి కావడం నిజంగా అభినందనీయం.

ఈ సందర్భంగా భారత్ వికాస్ పరిషత్ మరియు ఆయుష్ యోగా సేవా సమితి అధ్యక్షులు కండే ఆనంద్ గురూజీ మాట్లాడుతూ, "శారీరకంగా వికలాంగుడైనా, గుర్రం శ్యామ్‌కుమార్ మానసికంగా ఎంతో గొప్ప వ్యక్తి. శరీరంలో ఒక అవయవ లోపం ఉన్నా, మనసులో సేవాభావం, దయ, మానవత్వం నిండుగా ఉన్నాయి. ఈ రోజుల్లో సంపూర్ణ ఆరోగ్యంతో, అన్ని అవయవాలు సక్రమంగా ఉన్న ఎంతోమంది రక్తదానం చేయడానికి ముందుకు రావడం లేదు. అలాంటి పరిస్థితిలో శ్యామ్‌కుమార్ ఏడుసార్లు స్వచ్ఛందంగా రక్తదానం చేసి సమాజానికి ఆదర్శంగా నిలవడం నిజంగా ప్రశంసనీయమైన విషయం. వికలాంగత్వం శరీరానికే పరిమితం, సేవా సంకల్పానికి కాదు అనే విషయాన్ని ఆయన తన కార్యాచరణతో నిరూపించారు" అని కొనియాడారు.అలాగే గుర్రం శ్యామ్‌కుమార్ టెట్ పరీక్ష రాయడానికి ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సద్దాం మరియు బాబా ఆనంద్ గురూజీ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఆనంద్ గురూజీ, శ్యామ్‌కుమార్‌కు టెట్ పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఆర్థిక సహాయం అందించడమే కాకుండా, పరీక్షకు వెళ్లి రావడానికి అవసరమైన ప్రయాణ ఖర్చులను కూడా తానే భరిస్తానని ప్రకటించారు.

అంతేకాకుండా, ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న ఇతర వికలాంగులు కూడా తన దృష్టికి వస్తే, వారికి తమ వంతు ఆర్థిక సహాయం అందించి వారి విద్య, ఉద్యోగ లక్ష్యాలకు అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా ఈ మంచి విషయాన్ని ఆనంద్ గురూజీ దృష్టికి తీసుకువచ్చిన సద్దాం మరియు బాబాలను కూడా ప్రత్యేకంగా అభినందించారు. సమాజంలో అవసరమైన వ్యక్తులను గుర్తించి, వారికి సహాయం అందేలా చేయడం కూడా గొప్ప సామాజిక సేవేనని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఆనంద్ గురూజీ ప్రజలకు పిలుపునిస్తూ, "గుర్రం శ్యామ్‌కుమార్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి. రక్తదానం చేయడం అంటే ఒకరి ప్రాణాలను కాపాడడమే. వికలాంగుడైన శ్యామ్‌కుమార్ చూపిన సేవాస్ఫూర్తి ప్రతి సకలాంగునిలో ఉండాలి. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ కనీసం సంవత్సరానికి ఒకసారి అయినా స్వచ్ఛందంగా రక్తదానం చేసి సమాజానికి తమ వంతు సేవ చేయాలి. రక్తదానం మహాదానండ ఒక యూనిట్ రక్తం ఒక ప్రాణాన్ని నిలబెడుతుంది" అని విజ్ఞప్తి చేశారు.గుర్రం శ్యామ్‌కుమార్ చేసిన ఈ సేవ సమాజానికి ఒక స్ఫూర్తిదాయక సందేశం. ఆయన సేవాభావం మరెందరికో ప్రేరణగా నిలిచి, స్వచ్ఛంద రక్తదాన ఉద్యమానికి ఊతమివ్వాలని, మరెందరో యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు రావాలని భారత్ వికాస్ పరిషత్, ఆయుష్ యోగా సేవా సమితి మరియు విజయా బ్లడ్ బ్యాంక్ ఆకాంక్షించాయి.

# మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి







## జిల్లా టూరిజం అధికారిని కే.విజయలక్ష్మి

**నంద్యాల బ్యూరో, జులై 4 (రిపబ్లిక్ న్యూస్):**

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజుని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ఆయన బాటలో నడవాలని జిల్లా టూరిజం అధికారిని కె.విజయలక్ష్మి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు శ్రీ అల్లూరి సీతారామరాజు129 వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా టూరిజం అధికారిని విజయలక్ష్మి మాట్లాడుతూ...అల్లూరి సీతారామరాజు భారత స్వాతంత్ర మహా సంగ్రామంలో మహోజ్వల శక్తిగా వెలుగొందారని, అల్లూరి సీతారామరాజు విజయనగరం సమీపంలోని పాండ్రంగిలో జన్మించారని, ఆరవ తరగతి చదువుతున్న వయసులోనే తండ్రిని కోల్పోవడం ఆయన జీవితంలో పెనుమార్పులే తీసుకువచ్చిందన్నారు. కొండలు, అడవులలో తిరుగుతూ, గిరిజనుల జీవన విధానాన్ని గమనిస్తూ ఉండేవారని, జ్యోతిష్యం, వాస్తు శాస్త్రం, హఠ యోగం, కవిత్వం నేర్చుకున్నారని, వీటితో పాటు సంస్కృతం, ఆయుర్వేదం కూడా నేర్చుకున్నారన్నారు. ఆ రోజుల్లో ఏజన్సీ ప్రాంతంలోని ప్రజలు తెల్లదొరల చేతిలో అనేక దురాగతాలకు, దోపిడీలకు, అన్యాయాలకు గురయ్యేవారని, శ్రమదోపిడి, ఆస్తుల దోపిడి, స్త్రీల మానహరణం సర్వసాధారణంగా జరుగుతూ మన్యంలో గిరిజనుల జీవితం దుర్భరంగా ఉండేవన్నారు. మన్యం వాసుల కష్టాలను కడతేర్చటానికి, తెల్లదొరల దోపిడీని ఎదుర్కోవడానికి గిరిజనులకు అండగా నిలిచి పోరాడిన మహా వ్యక్తి అల్లూరి సీతారామరాజు అన్నారు.

అల్లూరి సీతారామరాజు ఆంధ్రప్రదేశ్ లో జన్మించడం అందులో మన తెలుగువాడిగా పుట్టడం మనం గర్వించదగ్గ విషయమన్నారు.

గిరిజన ప్రజల అభ్యున్నతికి పాటుపడిన అల్లూరి సీతారామరాజు 27 ఏళ్ళ వయసులోనే అమరవీరుడయ్యాడని తెలిపారు. దేశ స్వాతంత్రం కోసం తెల్లవారితో పోరాడిన మహావీరుడు అల్లూరి సీతారామరాజును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో సుబాకర్, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎస్పీ కార్యాలయంలో అల్లూరి జయంతి

**నంద్యాల క్రైమ్ జులై 04,(రిపబ్లిక్ న్యూస్ ):**



మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎస్. ఖాదర్ బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఖాదర్ బాషా మాట్లాడుతూ, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా గిరిజనులను సమీకరించి రంపా తిరుగుబాటుకు నాయకత్వం వహించిన అల్లూరి సీతారామరాజు ధైర్యసాహసాలు, త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (ఏఆర్) చిన్నికృష్ణ, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు బాబు, విజయ్, సురేష్ బాబు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలి

అధికారులు తమ శాఖకు సంబంధించిన ప్రగతి నివేదికలతో సీఎం కార్యక్రమానికి హాజరు కావాలి

అధికారులు సమన్వయంతో సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, జూలై 4( రిపబ్లిక్ న్యూస్):**



రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారాచంద్రబాబు నాయుడు గారు ఈనెల 9వ తేదీన బనగానపల్లె మండలంలో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ చేయనున్న సందర్భంగా సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా అధికారులకు సూచించారు.శనివారం జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా, ఈనెల 9వ తేదీన బనగానపల్లెలో సీఎం కార్యక్రమానికి సంబంధించి ముందస్తు ఏర్పాట్లు, మరియు వివిధ శాఖలలో జరుగుతున్న ప్రగతిపై అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ.... ఈనెల 9వ తేదీన బనగానపల్లెలో జరిగే ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు అధికారులు పకడ్బందీగా ఏర్పాటు చేసి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు.సీఎం పర్యటనకు రైతులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు ప్రజలు విచ్చేయనున్న సందర్భంగా ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.వాహనాల పార్కింగ్ కొరకు అనువైన ప్రదేశాలను ఏర్పాటు చేసి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలోని అన్ని శాఖల అధికారులు తమ శాఖలో జరుగుతున్న ప్రగతికి సంబంధించి ప్రగతి నివేదికలను సిద్ధం చేసుకొని సీఎం కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. సీఎం కార్యక్రమంలో ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు.నంద్యాల జిల్లాలో ముఖ్యంగా పెన్షన్ల పంపిణీ, వైద్య ఆరోగ్యం, గ్రౌండ్ వాటర్, ఉద్యానవన సాగు, హ్యాండ్లూమ్స్, రహదారులు భవనాల శాఖ, పంచాయతీరాజ్, డ్వామా, ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారం తదితర అంశాలలో సీఎం గారు అడిగిన ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పే విధంగా పూర్తి సమాచారంతో కార్యక్రమానికి హాజరు కావాలని జిల్లా కలెక్టర్ అధికారులకు పలు అంశాలపై దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి సీతారామరాజు స్ఫూర్తి భావితరాలకు చిరస్మరణీయం

ఆయన ఆశయాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయం - జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్

దేశాభివృద్ధి, సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయడమే అల్లూరికి నిజమైన నివాళి







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 4)**

స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 129వ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహనీయుడని పేర్కొన్నారు. బ్రిటీష్ పాలకుల అణచివేతకు వ్యతిరేకంగా గిరిజనులను సంఘటితం చేసి, వారి హక్కుల పరిరక్షణ కోసం అసాధారణ ధైర్యసాహసాలతో పోరాడిన గొప్ప నాయకుడిగా చరిత్రలో నిలిచిపోయారని అన్నారు.స్వేచ్ఛ, ఆత్మగౌరవం, దేశభక్తి, త్యాగం వంటి ఉన్నత విలువలకు అల్లూరి సీతారామరాజు ప్రతీక అని ఆయన తెలిపారు. స్వాతంత్ర్యం కోసం అల్లూరి చేసిన త్యాగం, చూపిన అంకితభావం నేటికీ ప్రతి భారతీయుడికి స్ఫూర్తినిస్తోందన్నారు. సమాజంలోని బలహీన వర్గాల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన పోరాటం భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.నేటి యువత అల్లూరి సీతారామరాజు ఆశయాలను ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణ, నిజాయితీ, దేశభక్తి, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడం మాత్రమే కాకుండా, వారు కలలుగన్న సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. దేశాభివృద్ధి, సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయడమే అల్లూరి సీతారామరాజుకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సెట్కూర్ సీఈవో వేణుగోపాల్, ట్రైబల్ వెల్ఫేర్ శాఖ అధికారి సురేష్, ట్రైబల్ వెల్ఫేర్ సలహామండలి డైరెక్టర్ వెంకటపతి, గిరిజన సంఘం నాయకులు కైలాస్ నాయక్, కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com